




వరద నీటి మునకలో నరసరావుపేట పట్టణం (పాత చిత్రం)







నరసరావుపేటలో జమ్ముతో, వ్యర్థాలతో పూడిపోయిన ప్రధాన వరద నీటి కాలువలు





నరసరావుపేటలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పురపాలక సంఘాల్లో వేసవి ప్రణాళికలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వర్షాకాలంలో ప్రజలకు వరద నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి. వర్షాలు కురవక ముందే పురపాలక సంఘాలలో ముంపు నివారణకు అవసరమైన పనులు పూర్తి చేయాలి. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు ముంపుకు గురవ్వకుండా వరద నీటి, ప్రధాన మురుగు కాలువల్లో పూడిక తీత చేపట్టాలి. గతంలో ఏఏ ప్రాంతాలు వరదనీటితో ముంపుకు గురయ్యాయో గుర్తించి ఆయా ప్రాంతాల్లో వరద నీటి కాలువలను అభివృద్ధి చేయాలి. వర్షాలు కురిస్తే ఈ పనులు చేపట్టేందుకు వీలుండదు. అయినా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

మేల్కోకుంటే.. మునకే!

- వర్షాకాలం ముందస్తు చర్యలు శూన్యం
- పూడి పోయిన వరద నీటి కాలువలు
- పూడిక తీతకు నోచుకోని వైనం
- భారీ వర్షం కురిస్తే పల్లపు ప్రాంతాలు మునకే
- చోద్యం చూస్తున్న మునిసిపల్ అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భారీ వర్షాలు కురిస్తే ఉమ్మడి జిల్లాల్లోని పట్టణాల్లో పల్లపు ప్రాంతాలు ఏటా ముంపుకు గురవుతున్నాయి. వర్షాకాలం ముందస్తు పనులు చేపట్టడాన్ని పురపాలకులు విస్మరిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. గత అనుభవాలను పరిశీలనలోకి తీసుకొని వరద నీరు గృహాల్లోకి ప్రవేశించ కుండా పూర్తిస్థాయి చర్యలు మునిసిపాలిటీల్లో చేపట్టాల్సి ఉంది. ఈ దిశగా మునిసిపల్ అధికారులు స్పందించటం లేదు. వర్షా కాలం తరుముకొస్తున్నా పురపాలకులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదు. ప్రతి మునిసిపాలిటీలో ఉన్న వరద నీటి కాలువలు, ప్రధాన మురుగు కాలువల్లో వర్షా కాలానికి ముందుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. పూడిపోయిన కాలువలను పునరుద్ధరించాలి. వరద నీరు సులువుగా కాలువల్లో ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రధాన మురుగు కాలువల్లో ప్రారంభం నుంచి చివరి వరకు పూడిక తీయాలి. వరద నీటి కాలువల్లో పెరిగిన జమ్ము, నాచు తొలగించాలి. కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా కాలువలను అభివృద్ధి చేయాలి. ఇందు కోసం మునిసిపాలిటీలు ప్రత్యేక నిధులు కేటాయించాలి. వేసవి కాలం ముగియ బోతున్నా సదరు పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పురపాలకుల్లో చలనం లేదు..

జూన్ మొదటి వారంలో వర్షాలు కురుస్తుంటాయని తెలిసినా పురపాలకుల్లో చలనం లేదు. ఇంజనీరింగ్, ప్రణాళికా, పారిశుధ్య విభాగాల అధికారులు కమిటీగా ఏర్పడి సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉంది. కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలి. సదరు విభాగాల అధికారులు వరద నీటి కాలువల్లో పూడిక తీత పనులు, పగిలి పోయిన కట్టడాల పునరుద్ధరణ చేపట్టేందుకు ఇంకా మునిసిపాలిటీలలో సమాయత్తం కాకపోవటం గమనార్హం. ఈ ఏడాదైనా ఈ పరిస్థితుల నుంచి పేదలను గట్టెక్కించేందుకు ఇప్పటికైనా వర్షాకాలం ముందస్తు పనులు చేపట్టే అంశంపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలి. నగర పంచాయతీలు, ఏ ఒక్క మునిసిపాల్టీలో కూడా ఈ పనులు చేపట్టలేదు. వర్షాకాలం ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికారులు ఇప్పటికైనా స్పందించాలి. వర్షాలు కురిసే సమయంలో పనులు చేసే పరిస్థితి ఉండదు.

వెంటాడుతున్న నిధుల కొరత...

మునిసిపాల్టీల్లో నిధుల కొరత వెంటాడుతోంది. ప్రభుత్వం నుంచి నిధులు రావడంలేదు. ఉద్యోగుల జీతాల చెల్లింపు కటకటలాడుతోంది. ఎన్నికల నేపథ్యంలో పన్ను వసూళ్లు పూర్తి స్థాయిలో జరగలేదు. ప్రభుత్వం వరుసగా నాలుగేళ్లు పన్ను పెంచడంతో కొత్త ప్రభుత్వం వస్తే పెంచిన పన్నులు తగ్గిస్తారన్న భావనతో పన్నులు చెల్లించేందుకు పురాల పౌరులు ముందుకు రాలేదు. దీంతో మునిసిపాల్టీల ఖజానాలు నిండుకున్నాయి. దీంతో వర్షాకాలం మందుస్తు చర్యలు తీసుకోవడంలో అలసత్వం నెలకొంది. కాంట్రాక్టర్లకు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. దీంతో సదరు పనులు చేపట్టేం దుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా లేరు. ఈ నేపథ్యంలో వరద నీటి కాలువల్లో పూడికతీత చేపట్టడం లేదు.

మురుగు కాల్వలను కబ్జా చేశారు..

వరద నీటి కాలువలు మునిసిపాల్టీలలో ఆక్రమణలకు గురయ్యాయి. అధికారం అండతో కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఏ ఒక్క మునిసిపాల్టీలో కూడా కాల్వలపై ఆక్రమణలు తొలగింపునకు ప్రయత్నాలు జరగడం లేదు. కాలువల కబ్జాదారులపై చర్యలు లేకపోవడంతో వారు రెచ్చిపోతున్నారు. మునిసిపాల్టీల రికార్డుల్లో నమోదైన ప్రకారం కాలువల విస్తీర్ణం లేదు. భారీ షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వాహకులు వారి షాపుల ముందు ఉన్న కాలువలపై ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తూ వాటిని కబ్జా చేస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన ప్రణాళికా విభాగాలు చోద్యం చూస్తున్నాయి. ఆక్రమణలతో కాలువలు కుంచించుకు పోయ్యాయి. దీంతో భారీ వర్షాలు కురిస్తే వరద నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. పల్లపు ప్రాంతాల్లోని గృహాలు ముంపునకు గురవుతున్నాయి. వరద నీటి కాలువలను పునరుద్ధరించకుంటే వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ముంప కష్టాలు తప్పవు.



కారంపూడిలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి, మూతపడ్డ దుకాణాలు



మాచర్ల పార్కు సెంటర్లో దుకాణాలను మూసివేయిస్తున్న పోలీసులు



మాచర్ల : నెహ్రూనగర్‌లో ముళ్ల కంచె ఏర్పాటుచేసి బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



పిన్నెల్లిలో వైసీపీ నేత ఇంట్లో లభ్యమైన పెట్రోలు బాంబులు





ముప్పాళ్ల: మాదల వైసీపీ నాయకుడు గుంటూరు సైదా నివాసంలో సోదాలు జరుపుతున్న సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ హజరత్తయ్య. ఆయన ఇంట్లో దొరికిన పెట్రో బాంబులు

పల్నాట.. పోలీసుల పహారా

- జిల్లాలో కొనసాగుతున్న 144 సెక్షన్
- నిర్మానుష్యంగా వీధులు.. దుకాణాల మూత
- ఎక్కడికక్కడ పోలీసు పికెట్లు.. ఇళ్లల్లో తనిఖీలు
- వైసీపీ నేతల ఇళ్లల్లో పెట్రో బాంబులు స్వాధీనం
- నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు

మాచర్లటౌన్, కారంపూడి, ముప్పాళ్ల, మాచవరం, పిడుగురాళ్ల, మే 16: పోలింగ్ అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చిన్న అలికిడి అయినా భీతిల్లిపోతున్నారు. పట్టణాలు, పల్లెలు పోలీసు పహారా మధ్య ఉన్నాయి. జిల్లా అంతటా 144 సెక్షన్ గురువారం కూడా కొనసాగింది. దుకాణాలను పోలీసులు తెరవనీయలేదు. దీంతో జిల్లా అంతటా అప్రకటిత కర్ఫ్యూ అమలవుతుంది. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ వీధులు జనసంచారం లేకపోవడంతో నిర్మానుష్యంగా మారాయి. రెండు రోజులుగా ఎటువంటి అల్లర్లు జరగలేదు. అయినా ఇరువర్గాల వారు ఏ సమయంలోనైనా దాడులకు పాల్పడే అవకాశం ఉందని భావించిన పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నారు. అనుమానితుల గృహాల్లో సోదాలతో పాటు ఎక్కడికక్కడ పికెట్లు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు. అదనపు బలగాలతో పికెట్లు కొనసాగుతున్నాయి. మాచర్లలో బందోబస్తు నిమిత్తం తమిళనాడు నుంచి 110 మందితో కూడిన పోలీసు బలగాలను గురువారం మాచర్లకి రప్పించారు. పట్టణంలో ఏఎస్పీ నాగేశ్వర రావు, డీఎస్పీలు ఐదుగురు, సీఐలు ఏడుగురు, ఎస్ఐలు 22 మంది, ఏఎస్ఐలు నలుగురు, హెడ్ కానిస్టేబుళ్లు 11, పోలీసు కానిస్టేబుళ్లు 40, హోంగార్డులు 101, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు 77 మంది, సీఐఎస్ఎఫ్ 90 మంది, ఏపీఎస్‌పీ 21 మంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. నియోజక వర్గంలోని మొత్తం ఐదు మండలాల్లో సుమారు 1000 మంది పోలీసు బలగాలు మోహరించాయి.

పిన్నెల్లి, మాదలలో పెట్రో బాంబులు స్వాధీనం

వైసీపీ నేతల ఇళ్లల్లో పెట్రో బాంబులు, కత్తులు, రాళ్లు, ఖాళీ బీరుసీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరికొన్ని చోట్ల కూడా బాంబులు ఉండే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. వైసీపీ నాయకులు ఆధిపత్యం కోసం టీడీపీ వారిని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నంలోనే ఈ పెట్రోలు బాంబులు, మారణాయుధాలు సిద్ధం చేసుకున్నట్లు అటు పోలీసులతో పాటు ఇటు సామాన్య ప్రజలు భావిస్తున్నారు. ముందస్తు సమాచారంతో పోలీసులు బుధవారం రాత్రి మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో ఇంటింటా సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో వైసీపీ నాయకులైన చింతపల్లి పెద్దసైదా, చింతపల్లి నన్నే గృహాల్లో పెట్రో బాంబులు బయటపడ్డాయి. టీడీపీ నాయకులైన షేక్ జానీబాష ఇంటిపైన గులకరాళ్లను పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు వైసీపీకి చెందిన ముగ్గుర్ని, టీడీపీకి చెందిన ముగ్గుర్ని బుధవారం రాత్రే అదుపులోకి తీసుకున్నారు. ముప్పాళ్ల మండలం మాదలలో పోలీసు తనిఖీల్లో వైసీపీ నాయకుడు గుంటూరు సైదా ఇంట్లోని బాత్‌రూంలో 29 పెట్రోల్ బాంబులను గుర్తించారు. సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ హజరత్తయ్య గురువారం వీటిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ బిందుమాధవ్ మాచర్లలో తిష్ట వేసి పోలీసు బృందాలకు సూచనలు చేస్తున్నారు. రింగురోడ్డు, పురపాలక సంఘం కార్యాలయం ప్రధాన రహదారి, నెహ్రూనగర్‌లలో ముళ్ల కంచెలు వేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

నిందితుల కోసం గాలింపు..

మంగళవారం కారంపూడిలో సీఐ నారాయణ స్వామిపై దాడి చేసిన వైసీపీ గూండాల కోసం పోలీసులు ప్రత్యేక బలగాలను దింపి గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని ప్రతి గ్రామంలో సోదాలు చేస్తున్నారు. దీంతో దాడులకు పాల్పడిన రౌడీ మూకలు గ్రామాల నుంచి పారిపోయారు. పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన ఘర్షణ, విధ్వంసాలకు పాల్పడిన వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మాచర్ల పట్టణంతోపాటు గ్రామాలను జల్లెడ పడుతున్నారు.

ప్రజలు విలవిల

మంగళవారం నాటి సంఘటనలతో జిల్లా అంతటా 144 సెక్షన్ కొనసాగుతుంది. దీంతో పోలీసులు దుకాణాలను తెరవనీయడం లేదు. రెండు రోజులుగా బయటకు అడుగుపెట్టేందుకు ప్రజలు భీతిల్లిపోతున్నారు. నిత్యావసరాలకు, తాగునీటికి సైతం విలవిల్లాడుతున్నారు. బయటకు వెళ్లి ఏం తెచ్చుకోవాలన్నా భయంతో ఉన్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు చిన్న చిన్న వ్యాపారులపై ఆంక్షలు సడలించినా పూర్తిస్థాయిలో నిత్యావసర వస్తువులు అందడం లేదు. ఇదే అదునుగా వ్యాపారులు అధిక రేట్లకు అమ్ముతున్నారు. 144 సెక్షన్ ఇంకెంత కాలం కొనసాగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సీఎంవోకు పిన్నెల్లి సోదరులు..

తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలు గురువారం పోలీసు ఎస్కార్ట్‌తో వెళ్లారు. శుక్రవారం విదేశాలకు వెళ్లనుండడంతో జగన్‌ను కలిసేందుకు సోదరులిద్దరూ వెళ్లారు.



శివశంకర్ లోతేటి

8 మందిపై వేటు

- అడ్డగోలు అధికారులపై ఈసీ కొరడా
- కలెక్టర్ బదిలీ.. ఎస్పీ సహా ఆరుగురి సస్పెన్షన్
- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఫలితం
- ఈ స్థాయిలో చర్యలు ఇదే ప్రథమం.. ఉలిక్కిపడిన యంత్రాంగం



ఎస్పీ బిందుమాధవ్



నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ



గురజాల డీఎస్పీ ఏ పల్లపురాజు



సీఐ కే ప్రభాకరరావు



సీఐ ఈ బాల నాగిరెడ్డి



కారంపూడి ఎస్ఐ రామాంజనేయులు



విజయపురి సౌత్ ఎస్ఐ డీవీ కొండారెడ్డి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఎలా ఉంటాయో ఎన్నికల కమిషన్ రుచి చూపించింది. అడ్డగోలుగా వ్యవహరించిన అధికారులపై కొరడా ఝుళిపించింది. కలెక్టర్ శివశంకర్‌ను బదిలీ చేయగా ఎస్పీ బిందుమాధవ్‌తో పాటు ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు ఎస్బీ సీఐలు, ఇద్దరు ఎస్ఐలను సస్పెండ్ చేస్తూ గురువారం రాత్రి ఎన్నికల సంఘం ఉత్తర్వులను విడుదల చేసింది. ఈసీ వేటు పడిన వారిలో గురజాల, నరసరావుపేట డీఎస్పీలు పల్లపరాజు, వీఎస్ఎన్ వర్మ, డీఎస్బీ సీఐలు ప్రభాకరరావు, బాలనాగిరెడ్డి, కారంపూడి, నాగార్జునసాగర్ ఎస్ఐలు రాంజనేయులు, కొండారెడ్డి ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒకేసారి ఇంతమందిపై చర్యలు తీసుకోవడం ఇదే ప్రథమం. ఎన్నికల కమిషన్ జిల్లా అధికారులపై తీసుకున్న చర్యలు సంచలనం కలిగించాయి.

ఈసీ ఆదేశించినా అలసత్వం..

రాష్ట్రంలో అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాలను గుర్తించి అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై ఎన్నికల సంఘం పోలింగ్‌కు ముందే నిర్దేశించింది. వాటిలో పల్నాడు జిల్లా పరిధిలోనే నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో ఎటువంటి చర్యలు తీసుకోవాలో గతంలోనే ఎన్నికల సంఘం సూచించింది. పోలింగ్ రోజున అరాచకాలు రాజ్యమేలుతాయని ముందుగానే కమిషన్ హెచ్చరించింది. అయినా జిల్లా ఎన్నికల యంత్రాంగం అలసత్వాన్ని వీడలేదు. అరాచకాలు జరగకుండా అడ్డుకోవడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. ఇందుకు తగిన మూల్యం అధికారులు చెల్లించుకున్నారు. మాచర్ల, గురజాల, నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాలో గత ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా అరాచక శక్తులు రెచ్చిపోయి, భారీగా విధ్వంసాలు సృష్టించాయి. టీడీపీ ఏజెంట్లపై దాడులు, మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిపై హత్యాయత్నం, పదుల సంఖ్యలో కార్ల ధ్వంసం, కార్ల దహనం, ఐదు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంల ధ్వంసం, పెట్రో బాంబులతో దాడులు ఇలా అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసు నిఘా వ్యవస్థ కూడా అరాచకాలకు సంబంధించి ముందస్తు సమాచారం సేకరించడంలో విఫలమైంది. ముందు నుంచి ప్రతిపక్షాలు అనుమానించిన విధంగానే విధ్వంసాలు జరిగాయి. పల్నాడులోని పరిస్థితులపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాల రూపంలో హెచ్చరించినా అధికారుల్లో చలనం లేదు. యంత్రాంగం నిర్లక్ష్యం ఫలితంగా పోలింగ్ తర్వాత కూడా అరాచకాలు రాజ్యమేలాయి. వందల సంఖ్యలో వైసీపీ మూకలు ఇనుప రాడ్లతో రోడ్డెక్కినా పోలీసులు నిరోధించలేకపోయారు. కారంపూడి విధ్వంసంలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి స్వయంగా పాల్గొన్నారు. దాడుల్లో వందల సంఖ్యలోనే గాయపడ్డారు. కారంపూడిలో ఏకంగా సీఐపైనే పిన్నెల్లి గ్యాంగ్ దాడి చేసి గాయపరిచింది. ఈ ఎన్నికల్లో పెట్రో బాంబులను వినియోగించారు.

రూ.5 కోట్లకు డీల్..

ఎన్నికల నిర్వహణలో అధికార పార్టీ అభ్యర్థులకు సహకరించేలా రూ.5 కోట్లకు డీల్ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే వైసీపీకి అనుకూలంగా పనిచేసేలా అధికారులను నియమించేందుకు డీల్ చేసుకున్నట్లు సమాచారం. బొప్పూడి వద్ద జరిగిన ప్రధాని మోదీ సభకు భద్రత కల్పించడంలో విఫలమవడంతో అప్పటి ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని బదిలీ చేశారు. అయితే అంతకముందే మాచర్లతో పాటు పలు నియోజకవర్గాలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించేలా కొందరూ పోలీసు అధికారులను నియమించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఈ ప్రచారాన్ని బలపరుస్తూ ఆ తర్వాత కూడా జిల్లాలో యథేచ్ఛగా దాడులు, దౌర్జన్యాలు కొనసాగాయి. పోలింగ్ రోజు, ఆ తర్వాత రోజు అవి తారాస్థాయికి చేరాయి. ఈ పరిస్థితులను ఉపేక్షించిన ఎన్నికల సంఘం ఏకంగా డీజీపీ, సీఎస్‌లను వివరణ కోరి మరీ తాజాగా అధికారులపై చర్యలు తీసుకుంది. కోడ్ వచ్చిన తర్వాత నుంచి జిల్లాలో ఇప్పటి వరకు కలెక్టర్, ఇద్దరు ఎస్పీలు సహా ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలపై ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. ఈ చర్యలతోనైనా ఎన్నికల యంత్రాంగంలో మార్పు వస్తుందో లేదో చూడాలి. కొత్త కలెక్టర్‌ను నియమించే వరకు జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా, ఇన్‌చార్జి ఎస్పీగా ఏఎస్పీ వీ రాఘవేంద్రరావు వ్యవహరించనున్నారు.

విధుల భారం

- విధుల బడలికతోనే ఎన్నికల సిబ్బంది
- 36 గంటలపాటు నిర్విరామంగా విధులు
- చెల్లింపుల్లో పక్షపాత వైఖరి

గుంటూరు(విద్య),మే16: ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి ఈసారి అధికారులు చుక్కలు చూపించారు. ఉమ్మడి జిల్లాలోని 17 అసెంబ్లీ, మూడు పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల కోసం దాదాపు 15 వేల మందికిపైగా సిబ్బందికి ఎన్నికల సంఘం విధులు కేటాయించింది. ఇందులో టీచర్లు, లెక్చరర్లుకు పీవో, అసిస్టెంట్ పీవో విధులు కేటాయించగా, ఇతర సిబ్బందికి వోపీవో బాధ్యతలు అప్పగించారు. ఇక ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పారిశుధ్య సిబ్బంది, ఆశావర్కర్లతో పాటు అనేక మందిని రిజర్వు సిబ్బందికి విధులు కేటాయించారు. ఈనెల 13న జరిగి ఎన్నికల ఒకరోజు ముందే పంపిణీ కేంద్రాల నుంచి ఈవీఎంలు, ఇతర సామగ్రి తీసుకుని తమకు కేటాయించిన బూత్‌లకు సిబ్బంది వెళ్ళారు. అప్పటి నుంచి వారు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కొన్నిచోట్ల పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. సామగ్రిని తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించడానికి 13వ తేదీ అర్ధరాత్రి వరకు పట్టింది. ఇక ఎన్నికల చెల్లింపులు ఇతర లాంఛనాలు పూర్తయ్యేసరికి 14వ తేదీ ఉదయం అయింది. అంటే దాదాపు 36 గంటల పాటు ఎన్నికల విధుల్లో సిబ్బంది పాల్గొన్నారు. దీంతో వయసు ఎక్కువ ఉన్న సిబ్బంది అనేక మంది తీవ్ర ఒత్తిడికి, బడలికకు గురయ్యారు. అనేక మందికి ఆరోగ్య సమస్యలు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలింగ్‌లో పాల్గొన్న సిబ్బంది కనీస మౌలిక వసతులు కల్పించ లేదనే ఆరోపణలు ఉన్నాయి. అనేక ప్రాంతాల్లో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు.

గుంటూరులోని ఏసీ కళాశాలలో రిజర్వు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రానికి ఆదివారం గుంటూరు నగరంతోపాటు జిల్లాలో బాపట్ల, పొన్నూరు, తాడికొండ తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో రిజర్వు సిబ్బందిని ఆర్వో రప్పించారు. టీచర్లతోపాటు అంగన్‌వాడీ టీచర్లు, ఇతర శాఖల సిబ్బంది ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో అరకొరగా భోజనం పెట్టి వారి పట్టించుకోవడం మరిచిపోయారు. దాదాపు 400 మందికిపైగా ఉన్న రిజర్వు సిబ్బంది సాయంత్రం వరకు కనీసం మంచినీరు కూడా లేకుండా కేంద్రంలో ఎదురు చూడాల్సి వచ్చింది. అనేక కేంద్రాల్లో సాయంత్రం 5 గంటలకే రిజర్వు సిబ్బందిని ఇంటికి పంపి మరుసటిరోజు అవసరాన్ని బట్టి విధులు కేటాయిస్తాని చెప్పారు. అయితే ఏసీ కళాశాలలో మాత్రం రాత్రి 8 గంటలైనా సిబ్బంది డ్యూటీలు కేటాయించ లేదు. తీరా రాత్రి 8.30 వచ్చిన ఎన్నికల అధికారులు మీరు ఇప్పుడు ఇంటివెళ్ళి మరలా ఉదయం 6 గంటల కల్లా రావాలని హుకుం జారీ చేశారని సిబ్బంది వాపోయారు. దీంతో సిబ్బంది తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు.



ఎన్నికలకు ముందు రోజు విధుల్లో తలమునకలైన సిబ్బంది (ఫైల్)

సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి చెల్లించే రెమ్యూనరేషన్ చెల్లింపులో తీవ్రస్థాయిలో తేడాలు ఉంటున్నాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఒక నియోజక వర్గంలో సిబ్బందికి చెల్లించిన రెమ్యూరేషన్‌లో మరో నియోజక వర్గంలో సిబ్బందికి చెల్లించిన రెమ్యూరేషన్‌లో తేడాలపై తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజక వర్గాల్లో పీవో, పీఈవోలకు రూ.2050, వోపీవోలకు రూ.750 చెల్లించారు. అదే విధంగా తాడికొండ, పొన్నూరు, పత్తిపాడు, తెనాలి నియోజక వర్గాల్లో పాల్గొన్న పీవో, ఏపీవోలకు రూ.1750, వోపీవోలకు రూ.500 చెల్లించారు. దీంతో పీవో, ఏపీవో స్థాయిలో చెల్లింపుల విషయంలో రూ.300, వోపీవో స్థాయిలో చెల్లింపుల విషయంలో రూ.250 వరకు తేడాలు ఉన్నాయని ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో అనేక నియోజక వర్గాల్లో ఇదే విధంగా తేడాలు ఉన్నాయని ఎన్నికల సిబ్బంది వాపోతున్నారు.

తీవ్ర ఒత్తిడిలో విధుల్లో పాల్గొన్నా...

ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది పోలింగ్‌కు ఒకరోజు ముందే కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఎన్నికల సమాగ్రి స్ట్రాంగ్ రూమ్‌లో అప్పగించే వరకు విధుల్లో కొనసాగారు. దీంతో ప్రతిస్థాయిలోనూ తీవ్ర ఒత్తిడితో పని చేశామని చెబుతున్నారు. తీరా తాము పడిన శ్రమకు ప్రతిఫలం లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 15 వేల మందికి పైగా సిబ్బంది నేరుగా ఎన్నికల విధుల్లో పాల్గొనగా, పరోక్షంగా మరో 5వేల మంది విధుల్లో పాల్గొన్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇలా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించిన వారిపట్ల పక్షపాత వైఖరి తగదని, అందరికి ఒకే స్థాయిలో చెల్లంపులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



చల్లావారిపాలెంలోని కేంద్రం వద్ద హాల్ టిక్కెట్లు తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు ప్రారంభం

- తొలి రెండు రోజులు అగ్రికల్చరల్, ఫార్మసీ పరీక్ష
- 18 నుంచి ఇంజనీరింగ్ స్ట్రీమ్ విద్యార్థులకు

గుంటూరు(విద్య), మే 16: ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రి కల్చరల్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్టు గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. కంప్యూటర్ బేస్డ్ విధానంలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం అగ్రికల్చరల్, ఫార్మసీ విద్యార్థుల కోసం 9 కేంద్రాలు, ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం 23 కేంద్రాలు ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు జేఎన్‌టీయూ(కాకినాడ) ఏర్పాటు చేసింది. ఆయా కోర్సుల్లో ప్రవేశంకోసం దాదాపు 17వేల మందికి పైగా హాజరుకానున్నారు. ఈనెల 16, 17 తేదీల్లో అగ్రికల్చరల్, ఫార్మసీ విద్యార్థులకు 18 నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నారు.

దళిత సర్పంచ్ ఇంటిపై వైసీపీ మూక దాడి

- ప్రచార వాహనం ఆటో అద్దాలు పగులకొట్టి ధ్వంసం



ధ్వంస మైన ఆటో

బెల్లంకొండ, మే 16 : మండల కేంద్రమైన బెల్లంకొండ దళిత సర్పంచ్ ఇంటి పై వైసీపీ నేతలు దాడికి యత్నించారు. ఆ సమయంలో బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం ఇంటిలో లేక పోవటంతో బయట ఉన్న ప్రచార వాహనం ఆటో అద్దాలను పగలగొట్టి ధ్వంసం చేశారు. ఆ సమయంలో చుట్టు పక్కలవారు వైసీపీ నాయకులను అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చే లోపే ఆటో అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ ఘటనపై సర్పంచ్ జ్యోతిసముద్రం మాట్లాడుతూ బెల్లంకొండ మండలంలో రౌడీ రాజకీయాన్ని ప్రోత్సహిస్తున్న వైసీపీ పెద్దలు ఇప్పటికైనా తమ పద్ధతులు మార్చుకోవాలన్నారు. ప్రశాంతంగా ఉండే పల్లెల్లో రౌడీ రాజకీయాలు రెచ్చగొడితే తాము చూస్తూ ఊరుకోమని, తాము తిరగబడితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని హెచ్చరించారు. దళితుల ఎదుగుదలను ఓర్వలేకనే వైసీపీ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. అనంతరం నిందితుడిని మహిళలు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.



మాట్లాడుతున్న పాపారావు, జాస్తి వీరాంజనేయులు

రూ.998.84 కోట్లు ఏమయ్యాయి?

- సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడే పాపారావు

గుంటూరు సిటీ, మే 16: కేంద్ర ప్రభుత్వం నెలన్నర క్రితం పంచాయతీలకు విడుదల చేసిన రూ.998.84 కోట్లు ఏమయ్యాయని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం బ్రాడీపేటలోని సర్పంచుల జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఖజానాలో నిధులుంటే ఎందుకు పంచాయతీల ఖాతాలో జమ చేయటం లేదు అని ప్రశ్నించారు. ఆర్థికశాఖ అధికారులను అడిగితే టోకెన్లను క్లియర్ చేయాల్సి ఉన్నదని చెబుతున్నారని అన్నారు. వేసవిలో కనీసం మంచినీరు కూడా గ్రామాల్లో అందించలేని దుస్థితి లో సర్పంచ్‌లు ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరంజనేయులు మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన నిధులు పక్కదారి పట్టించి స్థానిక సంస్థలను ఇబ్బందులపాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వానికి గడచిన ఎన్నికల్లో ప్రజలు బాగానే బుద్ధి చెప్పి, ఇంటికి సాగనంపుతున్నారని అన్నారు. తాగేందుకు నీళ్ల లేక ఖాళీ బిందెలతోటి ప్రజలు నిరసన ప్రదర్శన చేస్తూ ఉంటే రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి సత్యనారాయణ నిమ్మకు నీరెత్తినట్లు చూస్తూ కూర్చోవడం దుర్మార్గం అని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సర్పంచులు చందు వెంకట సాంబశివరావు, నల్లపాటి లలిత కుమారి, కొర్రపాటి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అల్లర్లపై కేసులు నమోదు

క్రోసూరు, మే 16: క్రోసూరు మండలంలో ఎన్నికల సందర్భంగా మే 13వ తేదీన జరిగిన గొడవలకు గాను ఐదు కేసులు నమోదు చేసినట్టు పెదకూరపాడు సీఐ మంగారావు తెలియ జేశారు. మండలంలోని దొడ్లేరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తలు ఒకరిపై ఒకరు పలుమార్లు బాహాబాహీకి దిగారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఎర్రబాలెంలో జరిగిన వైసీపీ దాడుల్లో టీడీపీ మద్దతుదారులు ఇద్దరికి గాయాలయ్యాయి. మంగళవారం రాత్రి క్రోసూరులో టీడీపీ నేత కంభంపాటి రాము, కంభంపాటి బాబులపై వైసీపీ శ్రేణులు దాడులు చేశాయి. ఈ ఘటనలో కూడా వైసీపీకి చెందిన కొందరిపై కేసులు నమోదు చేసినట్టు తెలియజేశారు. మరికొంత మందిని స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేసినట్టు తెలిపారు.

పది కేసులు నమోదు ..

నరసరావుపేట లీగల్: ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో అల్లర్లకు సంబంధించి పది కేసులు నమోదైనట్టు సంబంధిత అధికారులు తెలిపారు. రూరల్ పరిధిలో దొండపాడు గ్రామంలో ఒకటి, పమిడిపాడులో ఒకటి కేసులు నమోదయ్యాయని, టీడీపీకి చెందిన ఓ కారు ధ్వంస మైందని రూరల్ ఎస్ఐ ఎం రోశయ్య తెలిపారు. మొదటి పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై టీడీపీ వర్గీయులు దాడి చేసినట్టు కేసు నమోదైందని సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి తెలిపారు. రెండవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో టీడీపీ వారిపై మూడు కేసులు, వైసీపీ వారిపై రెండు కేసులు నమోదయ్యాయని రెండవ పట్టణ సీఐ ఏ భాస్కర్ తెలిపారు. రొంపిచర్ల పరిధిలో ఎన్నికల అల్లర్లకు సంబంధించి రెండు కేసులు నమోదైనట్టు డీఎస్పీ వర్మ తెలిపారు. ఎన్నికల అల్లర్ల సంబందంగా మొత్తం ఏడు కార్లు ధ్వంసం అయినట్టు వర్మ తెలిపారు.

పెదఅగ్రహారంలో కేసు నమోదు

పిడుగురాళ్ల: సాధారణ ఎన్నికల రోజున పిడుగురాళ్ల మండల పెదఅగ్రహారం గ్రామంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన గొడవల్లో ఇరువర్గాలకు చెందిన 32 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రబ్బాని తెలిపారు.

21న అరుణాచలం గిరి ప్రదక్షిణకు

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, మే 16: పౌర్ణమి సందర్భంగా ఈనెల 23న అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి 21న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 22వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 23న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 24వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 బస్సు సర్వీస్ నెంబర్‌కు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కో ఛార్జీ రూ.2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459ను సంప్రదించాలని కోరారు.

టీడీపీ నేతల హౌస్ అరెస్టు



ఆనందబాబుకు నోటీసు అందిస్తున్న సీఐ

గుంటూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు సహా పలువురు టీడీపీ నేతలను గురు వారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈనెల 13న ఎన్నికల సందర్భంగా, అనంతరం ఎన్నికలు ముగి సిన తర్వాత వైసీపీ మూక అల్లర్లు, దాడులు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న తరుణంలో వైసీపీ గూండాల దౌర్జన్యాలపై టీడీపీ బుధవారం ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో జిల్లా నుంచి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, జూలకంటి బ్రహ్మారెడ్డితో పాటు పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య వున్నారు. వీరంతా గురువారం ఉదయం మాచర్ల వెళ్లవలసివుండగా వారిని ఎటూ కదలనీయ కుండా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. బుధవారం అర్ధరాత్రి మంత్రి ఆనంద బాబు, జంగా కృష్ణమూర్తి, బ్రహ్మా రెడ్డి ఇళ్ల వద్దకు వచ్చి పోలీసులు మోహరించారు. ఆనందబాబుకు గురువారం ఉదయం సీఐ నోటీసులు అందజేశారు. ఈ నిర్బంధాలను టీడీపీ నేతలు ఖండించారు. తమ పార్టీ కార్యకర్తలపై దౌర్జన్యాలు, దోపి డీలు జరుగుతున్నా పట్టించుకోని పోలీసులు, తమను మాత్రం గృహ నిర్బంధంచేయడం దుర్మార్గమని, ప్రజాస్వామ్య విరుద్ధమని ఆనందబాబు, చిట్టాబత్తిన చిట్టిబాబు, మద్దిరాల మ్యాని విమర్శించారు.

పావలా సంక్షేమానికి ముప్పావలా వడ్డీ

- చెత్త పన్ను దగ్గర నుంచి కరెంటు బిల్లు వరకు బాదుడే బాదుడు
- 1612వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే 16: వైఎస్ జగన్‌రెడ్డి పాలన ప్రజలకు పావలా సంక్షేమాన్నిచ్చి ముప్పావల వడ్డీ వసూలు చేసినట్టుందని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు భూములిచ్చిన రైతులు ఎద్దేవా చేశారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1612వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు ముసుగులో జగన్‌రెడ్డి ప్రజల నుంచి కోట్ల రూపాయలను కొల్లగొట్టాడని, ఓ వైపు ధరాల భారాలు, మరో వైపు పన్ను పోటు ప్రజల నడ్డివిరిచాయని అన్నారు. పేద వర్గాల అభ్యున్నతి మాటున ఆయా ప్రజలను అడ్డగోలుగా దోచుకున్నాడని మండిపడ్డారు. మూడు రాజధానులంటూ ఉన్న రాజధానిని లేకుండాచేసి లక్షల కోట్ల అమరావతి సంపదను ఆవిరి చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తి మరీ ప్రభుత్వంపై తమ నిసనను తెలియజేశారని, ఈ దుర్మార్గ పాలన అంతమై త్వరలోనే కూటమి ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. అప్పుడు రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు, పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభమై పూర్తవుతాయని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

జంగాపై జగన్ అక్కసు

- అర్ధరాత్రి వేళ అనర్హత వేటు
- వివరణ తీసుకోకుండానే బీసీ నేతపై కక్షసాధింపు
- భగ్గుమంటున్న యాదవ సామాజిక వర్గం



జంగా కృష్ణ మూర్తి

గుంటూరు, మే 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్న గురజాల నియోజకవర్గ నేత జంగా కృష్ణమూర్తిపై సీఎం జగన్‌రెడ్డి కక్ష తీర్చుకున్నారు. బుధవారం అర్ధరాత్రి ఆయన ఎమ్మెల్సీ పదవిపై అనర్హత వేటు వేయించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే బీసీ సామాజికవర్గ నేతపై జగన్ కక్ష సాధిం పునకు పాల్పడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కనీసం వివరణ కూడా తీసుకోకుం డానే తనను పదవి నుంచి తప్పించారని జంగా కృష్ణమూర్తి గురువారం ఆరోపించారు. జంగా విషయంలో వైసీపీ అధిష్టానం, ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న చర్యపై యాదవ సామాజిక వర్గం భగ్గుమంటోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని యాదవ సామాజిక వర్గంలో జంగా కృష్ణమూర్తికి ప్రత్యేకమైన స్థానముంది. 1999కి ముందు ఆయన తెలుగుదేశం పార్టీ ట్రేడ్ యూనియన్ నాయకునిగా కొనసాగారు. గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే సీటు ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం మొగ్గు చూపటంతో ఆ పార్టీలో చేరారు. వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009 ఎన్నికల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గురజాల సీటును డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లకు కేటాయిం చినప్పటికీ జంగా ఆ కుటుంబానికి విధేయుడుగానే కొనసాగుతూ వచ్చారు. రాజశేఖర్‌రెడ్డి మరణాంతరం జంగా కృష్ణమూర్తి జగన్ వెన్నంటే వున్నారు. వైసీపీలో చేరటానికి చాలామంది తటపటాయిస్తున్న రోజుల్లో అందరికంటే ముందు ఆ పార్టీ లో చేరారు. జగన్మోహన్ రెడ్డి ఓదార్పు యాత్రలో ఆయన వెన్నంటే వున్నారు. వైసీపీ బీసీ రాష్ట్ర అధ్యక్షుడు పదవిని తీసుకుని జగన్ కోసం రాష్ట్రంలో తీవ్రంగా పర్యటించారు. బీసీ సామాజిక వర్గాలను ఏకతాటి పైకి తీసుకువచ్చి వైసీపీకి ఓట్లు వేయించారు. చివరకు జంగా ఆరోగ్యం బాగాలేని పరిస్థితిలో కూడా జగన్ కోసం అహర్నిశలు శ్రమించారు.

ఆయన పదవి కోసం పాదయాత్ర..

రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జంగా కృష్ణమూర్తి జగన్ కోసం సాహసోపేతమైన కార్యాన్ని చేశారు. జగన్మోహన్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ గురజాల నుంచి హైదరాబాదు వరకు పాదయాత్ర చేశారు. ఈ వ్యవహారం అప్పట్లో రాజకీయ సంచలనం సృష్టించింది. నాటి ముఖ్యమంత్రి రోశయ్య కూడా జగన్ కోసం కృష్ణమూర్తి పాదయాత్ర చేశారన్న నెపంతో ఆయనపై కినుక వహించారు. 2014 ఎన్నికల్లో జగన్ నేను ముఖ్యమంత్రి కావాలా.. నీకు గురజాల ఎమ్మెల్యే సీటు కావాలా అని అడిగితే.. మీరు ముఖ్యమంత్రి అయితే చాలు అంటూ ఎమ్మెల్యే బరిలో నుంచి తప్పుకొన్నారు. జంగా సీటు త్యాగంతో గురజాలలో అడుగుపెట్టిన కాసు మహేష్‌రెడ్డి ఆయన్ను చాలా అవమానిస్తూ వచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టినప్పటికీ పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. గురజాల నియోజకవర్గంలోని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీలో సీనియర్ నాయకుడుగా ఉన్న ఎమ్మెల్సీ జంగాను అడుగడుగునా ఇబ్బందులు పెడుతూ వచ్చారు. చివరకు ఆయనతో సన్నిహిత సంబంధాలు ఉన్న సొంత పార్టీ నేతలపై కూడా కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ఒకానొక దశలో కాసు మహేష్ రెడ్డి జంగా కృష్ణమూర్తికి మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడింది. నియోజకవర్గంలో జరుగుతున్న అవమానాలను జంగా పలుమార్లు పార్టీ ముఖ్య నేతలు దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ఎవరూ పెద్దగా స్పందించక పోగా చూద్దాం అంటూ వాయిదాలు వేస్తూవచ్చారు. సీఎం జగన్మోహన్ రెడ్డితో కూడా జంగా నియోజకవర్గంలో జరుగుతున్న విషయాలపై చర్చించారు. తనకోసం ఎంతో కష్టపడిన జంగాకు అడుగడుగునా అవమానాలు ఎదురవుతున్నా జగన్మోహన్‌రెడ్డి కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. దాంతో మహేష్ రెడ్డి జంగా వ్యవహారంలో మరింత దూకుడుగా ప్రవర్తించి పార్టీ నుంచి బయటకు వెళ్ళేటట్లు చేశారు.

డీఆర్‌ఎం రోడ్డులో ఆర్‌యూబీ మూసివేత

గుంటూరు, మే16(ఆంధ్రజ్యోతి): డీఆర్‌ఎం రోడ్డు నుంచి నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాలవైపు దారిలోవున్న ఆర్‌యూబీని నెల రోజులపాటు మూసివేస్తున్నట్లు గుంటూరు రైల్వే డివిజినల్ మేనేజర్ ఎం రామకృష్ణ తెలిపారు. ఈ నెల 19 నుంచి జూన్ 18 వరకు బ్రిడ్జి సీసీ రోడ్డు అప్రోచ్‌ల రిపేర్ల నిమిత్తం ట్రాఫిక్‌ని మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. దీని దృష్ట్యా ట్రాఫిక్‌ని ఎల్‌సీ నెంబరు. 6, 311 మీదగా మళ్లిస్తున్నామని, వాహనదారులు గమనించాలని కోరారు.

హతుడు నెల్లూరు వాసి

- పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు?

బాపట్ల, మే 16: పోలీసు కార్యాలయాల సముదాయానికి కూతవేటు దూరంలో బాపట్ల పాతబస్టాండ్ దగ్గర నడిరోడ్డుపై ఓ యువకుడిని అతి కిరాతకంగా, విచక్షణా రహితంగా కారుతో గుద్దించి కత్తులతో ఇష్టానుసారంగా నరికి హత్య చేసిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. హతుడి వివరాలకోసం పోలీసులు చుట్టుపక్కల దుకాణాలలో సీసీకెమెరాల పుటేజ్‌లు పరిశీలించిన ఫలితం లేక పోయింది. దీంతో చుట్టుపక్కల పోలీసుస్టేషన్‌లకు సమాచారం ఇచ్చి వాహనాలు తనిఖీ చేయమని డీఎస్పీ మురళీకృష్ణ ఆదేశించారు. స్టూవర్టుపురం పోలీసుస్టేషన్ చెక్‌పోస్ట్ దగ్గర విస్తృత తనిఖీలు చేపట్టగా కారులో నుంచి రక్తపు మరకలతో ఓ వ్యక్తి బయటకు దూకి పొలాలలో గుండగా పరిగెత్తే ప్రయత్నం చేశాడు. కారులో ఉన్న మరికొందర ఆపకుండా చెక్‌పోస్ట్ గేట్‌లను సినీఫక్కీలో ఢీకొట్టుకుంటూ వెళ్ళిపోయారు. పొలాల్లో పరిగెత్తుతున్న ప్రధాన నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. మృతుడు నెల్లూరులోని పెన్నానది ఒడ్డున వైకుంఠపురంకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడు తల్లి అక్కడ రోజువారి తాపీవర్కర్‌గా పనిచేస్తుంది. మృతుడు తండ్రి జయపాల్ టీ మాస్టర్‌గా పనిచేస్తూ బాపట్ల పట్టణంలోని మరియరాణి కాలనీలో ఉంటున్నాడు. గతంలో మృతుడు ప్రశాంత్ నెల్లూరు దగ్గర ఓ వ్యక్తిని దారుణంగా హత్యచేశాడు. ఈ ఘటనలో జైలుకెళ్ళిన ప్రశాంత్ ఇటీవల బెయిల్‌పై వచ్చాడు. హత్యకు గురైన వ్యక్తి బంధువులు ప్రశాంత్‌ను చంపుతారనే భయంతో తల్లి ఇంట్లో నుంచి బయటకు రాకుండా చూచుకుంటున్నది. కాగా తండ్రిని చూచేందుకు బాపట్ల వచ్చిన ప్రశాంత్ బుధవారం రాత్రి పాతబస్టాండ్‌లోని ఓ బార్‌లో మద్యం తాగి వెళుతుండగా అతని స్నేహితుని ద్వారా సమాచారం తెలుసుకున్న నెల్లూరుకు చెందిన వ్యక్తులు కారులో వెంబడిస్తూ అవకాశం చూచుకొని పాతబస్టాండ్ దగ్గర కారుతో ఢీకొట్టి కత్తులతో నరికి చంపి పరారయ్యారు. చివరకు స్టూవర్టుపురం పోలీసుస్టేషన్ దగ్గర ప్రధాన నిందితుడు పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. కాగా ఈ విషయమై పట్టణ సీఐ యు.శ్రీనివాసులను వివరణ కోరగా రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ప్రశాంత్ హత్యకు గురైనట్లు తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు గురువారం బాపట్ల ఏరియా వైద్యశాలకు చేరుకున్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు

నరసరావుపేట లీగల్, మే 16: చెల్లని చెక్కు కేసులో నేరం రుజువవ్వటంతో నిందితురాలికి ఏడాది జైలు శిక్ష, నష్ట పరిహారం చెల్లించేలా న్యాయాధికారి గురువారం తీర్పు వెలువరించారు వివరాల్లోకి వెళితే.. చిలకలూరిపేటలోని గుర్రాల చావిడి ప్రాంతానికి చెందిన షేక్ నాగుర్‌బీ 2020 అక్టోబరు 10న పట్టణంలోని బరంపేటకు చెందిన గట్టినేని చంద్రమౌళి వద్ద రూ.5 లక్షలు అప్పుగా తీసుకుంది. ఇందుకు గాను రూ.6.50 లక్షలకు చెక్కు ఇచ్చింది. ఫిర్యాది చంద్రమౌళి సదరు చెక్కును తన బ్యాంక్ ఖాతాలో వసూలుకు వేసుకున్నాడు. అది చెల్లలేదు. విచారణలో నేరం రుజువవ్వటంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. ఆమెకు ఏడాది జైలు శిక్ష, రూ 7.50 లక్షలు ఫిర్యాదికి నష్ట పరిహారం చెల్లించేలా స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవల్లిక గురువారం తీర్పు వెలువరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	158, 167,178
చికెన్ విత్ స్కిన్	306.00
చికెన్ స్కిన్ లెస్	316.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

డెంగీ నివారణకు శుక్రవారం డ్రైడేగా పాటించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి సూచన

గుంటూరు (మెడికల్), మే 16 : డెంగీ వ్యాధి నివారణకు ప్రతి శుక్రవారాన్ని ప్రజలు డ్రైడేగా పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి కోరారు. జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకొని గురువారం ముత్యాలరెడ్డి నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా దోమకాటు నివారణ చర్యలు తీసుకుంటే డెంగీతో పాటు ఐదు రకాల ప్రమాదకరమైన జబ్బుల నుంచి రక్షణ పొందవచ్చని ఆమె సూచించారు. అనంతరం ర్యాలీ నగర వీధుల్లో సాగింది. ర్యాలీ ముగిసిన తర్వాత పట్టణ ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన వయోజనులకు బీసీజీ వ్యాక్సినేషన్ శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి ప్రారంభించారు. ప్రతి గురువారం సచివాలయాల్లో బీసీజీ వ్యాక్సిన్ ఇస్తారని, 18 ఏళ్లు నిండిన వారు టీబీ విన్ పోర్టల్‌లో తమ పేరు నమోదు చేసుకొని ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, డీఎంవో సుబ్బరాయన్, ఏఎంవో రాజునాయక్, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఎస్ఈ శిక్షణ పోస్టర్స్ ఆవిష్కరణ

గుంటూరు(విద్య), మే 16 : పది సీబీఎస్ఈ సిలబస్‌కు సంబంధించి బయాలజీ, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులపై ఈనెల 19వ తేదీన జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు, ఇందుకు సంబంధించిన పోస్టర్స్‌ను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు గురువారం ఆవిష్కరించారు. స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు పాల్గొన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక లాంలో గల చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణా తరగతులు ఉంటాయని వివరించారు. ఇప్పటికి దాదాపు 200 మంది పైగా ఉపాధ్యాయులు తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్నారని, రిజిస్ట్రేషన్ చేసుకున్న ఉపాధ్యాయులు 19వ తేదీ ఉదయం 9:30 గంటలకల్లా చలపతి ఇంజనీరింగ్ కళాశాలకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా రిజిస్టర్ చేసుకోని ఉపాధ్యాయులు వెంటనే తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. కార్యక్రమంలో టీఆర్ రమేష్, బి.ప్రసాద్, జి.వెంకటేశ్వర్లు, టిఆర్ చాందని, సుబ్బారాయుడు, బి.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు 9948015701 నెంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జేవీవీ నాయకులు

సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో సీతారామయ్య హైస్కూల్ విజయకేతనం

● నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

గుంటూరు(కార్పొరేషన్), మే 16 : ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ పదవ తరగతి పరీక్షా ఫలితాలలో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ పదవ తరగతి సెకండ్ బ్యాచ్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి విజయకేతనం ఎగురవేశారు. పాఠశాలలో గురువారం విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. సభకు పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ అధ్యక్షత వహించారు. పాఠశాల గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ వై.శివాజీ మాట్లాడుతూ పరీక్షలకు హాజరైన 38 మంది విద్యార్థులలో 26 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణి ఫలితాలను సాధించి విజయకేతనం ఎగరవేశారన్నారు. సుంకర గాయత్రి 470/500తో ప్రథమ స్థానంలో, గూడపాటి దినేష్ కార్తీక్ చౌదరి 464/500తో ద్వితీయ స్థానం, ఆశిం షేక్ 458/700 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. పాఠశాల అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు మాట్లాడుతూ తమ పాఠశాలలోని క్రమబద్ధమైన విద్యా ప్రణాళిక, ఉపాధ్యాయుల మెరుగైన శిక్షణ, విద్యార్థుల ఎనలేని పట్టుదల, కృషి ఫలితమే ఈ విజయం అని తెలిపారు. పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఈ విజయంలో భాగమైన ఉపాధ్యాయులను, విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను ప్రశంసించారు. పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతీదేవి, సీనియర్ కో ఆర్డినేటర్ దుర్గా శ్యామ్, ప్రీ ప్రైమరీ కో ఆర్డినేటర్ శ్రీదేవి ఈ సభలో పాల్గొని విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న మాజీ ఎంపీ శివాజీ, పాటిబండ్ల విష్ణు వర్ధన్ తదితరులు

దాడిపై కేసు నమోదు

● మద్యం మత్తులో యువకుల హల్‌చల్

పెదనందిపాడు, మే 16: మద్యం మత్తులో ఓ వ్యక్తిపై యువకులు దాడి చేసిన ఘటనపై గురువారం పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం బుధవారం రాత్రి స్థానిక హోండా షోరూమ్ ఎదుట కాకుమాను మండలం గార్లపాడుకు చెందిన పల్లెకోన నాగేశ్వరరావును పెదనందిపాడుకు చెందిన ముండ్లమూరి హరిప్రసాద్(నాని), రుద్రపాటి బాలరాజు, షేక్ అమీర్ మరి కొంతమంది యువకులు కలిసి నాగేశ్వరరావు ద్విచక్ర వాహనాన్ని ఆపి, నీ మేనల్లుడి ప్రేమ వివాహానికి ఎందుకు సహకరించావంటూ, నిన్ను చంపుతామని దుర్భాషలాడి కర్రలతో కొట్టడంతో స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. ఎంత సేపటికి 108 రాకపోవడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రాజ్‌కుమార్ క్షతగాత్రుడిని ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెదిరింపులపై కేసు

పెదనందిపాడు, మే 16: స్థానిక ఎస్సీ కాలనీ వాసులను చంపుతామని బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇద్దరు యువకులు హల్‌చల్ చేశారు. పోలీసుల వివరాల మేరకు పెదనందిపాడుకు చెందిన పైర్ల కిరణ్, విజయవాడకు చెందిన సాయి అనే ఇద్దరు యువకులు కత్తులు చూపించి చంపుతామని బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన కాలనీవాసులు వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్ఐ రాజ్‌కుమార్ వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఆ ఇద్దరు పలు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నందున వారిని గుంటూరు సీసీఎస్‌కు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

69 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మే 16: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 69 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,100 గరిష్ఠధర రూ.14,150, మోడల్‌ధర రూ.13,700 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,101, గరిష్ఠధర రూ.13,700, మోడల్‌ధర రూ.13,700 పలికాయి.

నిలువ నీడ లేక..

● బస్టాప్‌ల వద్ద ప్రయాణికుల నరకయాతన
● నీడలేక, నిలబడలేక ఇబ్బందులు
● పట్టించుకోని జీఎంసీ యంత్రాంగం

గుంటూరు, మే 16 : భానుడి భగభగలతో రహదారులపై ప్రయాణికులు నిలువ నీడ లేక అల్లాడిపోతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో సైతం బస్టాప్‌ల వద్ద కనీసం బస్ షెల్టర్లు లేని దుస్థితి నెలకొన్నది. నగరంలోని ప్రధాన ప్రాంతాలైన కూరగాయల మార్కెట్ సెంటర్, బస్టాండ్ ఏరియా, పొన్నూరు రోడ్డు, నాజ్ సెంటర్, జీటీ రోడ్డులోని మెడికల్ క్లబ్ సెంటర్, చుట్టుగుంట సెంటర్, జీజీహెచ్ ఏరియా, గుజ్జనగుండ్ల సెంటర్ ప్రాంతాల్లో బస్ స్టాప్‌ల వద్ద కనీసం బస్ షెల్టర్లు లేని పరిస్థితి నెలకొన్నది. బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తామని గతంలో నగర పాలక సంస్థ అధికారులు చేసిన ప్రకటనలు నీటిపై రాతలుగానే మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేసేందుకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు ముందుకొచ్చేవి. అటువంటి ప్రయత్నం కూడా అధికార యంత్రాంగం చేస్తోన్న దాఖలాలు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదికేడాది పెరుగుతోన్న ఎండలతో కనీసం నిలబడేందుకు షెల్టర్లు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. మండుటెండలకు ప్రజలు ఎండలోనే బస్సులు, ఆటోల కోసం నిలబడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. కనీసం వృక్షాలు కూడా లేని పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో ప్రజలు నడి ఎండలో రోడ్డుపై నిలిచి నీరసించిపోతున్నారు.



మార్కెట్ సెంటర్‌లో ఎండలోనే ప్రయాణికులు



జీటీ రోడ్డులోని మెడికల్ క్లబ్ సెంటర్‌లో రోడ్డుపైనే ప్రయాణికులు



చుట్టుగుంట సెంటర్‌లో ఎండలోనే ప్రయాణికులు

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు

ఆర్వోలతో జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు సిటీ, మే 16: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లనకు సంబంధించి గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించిన భవనాల్లో కౌంటింగ్‌కు సంబంధించిన టేబుళ్ళు, బారికేడింగ్, సీసీ కెమెరాల ఏర్పాట్లతో పాటు అవసరమైన ఇతర సౌకర్యాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులు పరిశీలించి, వెంటనే పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ, ర్యాండమైజేషన్ ప్రక్రియలు సక్రమంగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ రోజు టేబుళ్లు, రౌండ్ల వారీగా వివరాలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన సిబ్బందిని, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ తదితర సౌకర్యాలను ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో పెద్దిరోజా, ఆర్డీవో శ్రీఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, జీఎంసీ ఏసీ రాజ్యలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్(ట్రైనీ) స్వాతి తదితరులు పాల్గొన్నారు.



ఓట్ల లెక్కింపుపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ఎన్నికల కార్యాలయానికి తాళాలు

● గుంటూరుకు మకాం మార్చిన ఆర్వో
● రెవెన్యూ సిబ్బందిని వెంటతిప్పుకుంటున్న తీరు

తాడికొండ, మే 16: తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎం గంగరాజు తీరు వివాదాస్పదంగా ఉన్నది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియటంతో తాడికొండ ఎన్నికల కార్యాలయానికి తాళాలు పడ్డాయి. గుంటూరు కలెక్టరేట్‌లోని కేఆర్ఆర్సీ, మీ సేవా కార్యాలయాన్ని తాడికొండ ఎన్నికల కార్యాలయంగా మార్చివేశారు. నామినేషన్ నోటిఫికేషన్ ప్రకటించే రెండు మూడు రోజులు ముందు తాడికొండకు వచ్చారు. అనంతరం పోలింగ్ ముగిసి మూడు రోజులు కాకుండానే తన మకాంను గుంటూరుకు మార్చివేశారు. గతంలో జరిగిన ఎన్నికల అధికారులు ఆర్వో కార్యాలయాన్ని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసుకొని పాలన సాగించారు. కాని గంగరాజు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు చేపట్టగానే ఆర్వో కార్యాలయాన్ని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని భవనంలోకి తరలించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్వో కార్యాలయానికి షిఫ్ట్ అయ్యారు. ఆర్వో కార్యాలయాన్ని తరలించిన ఆర్వో మాత్రం తాడికొండకు రాకుండా గుంటూరులోని తన ఆఫీసులో సమావేశాలు నిర్వహించే వారు దీంతో తాడికొండలోని రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది పోలోమంటూ గుంటూరు వెళ్లాల్సి వచ్చేది. అధికారులు అందుబాటులో లేకపోవడంతో రెవెన్యూ పనుల కోసం వచ్చే అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించే వారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడటంతో సిబ్బంది అసహనం వ్యక్తం చేయటంతో పాటు ఆర్వోపై ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. మీడియా ప్రతినిధులకు సైతం సమాచారాన్ని ఇవ్వటంలో తీవ్ర జాప్యం చేయటంతో పాటు పూర్తి సమాచారం ఇవ్వకుండా మీడియాపై దురుసుగా ప్రవర్తించారు. పోలింగ్ రోజు కూడా మీడియాకు సమాచారాన్ని అందించటంతో తీవ్ర జాప్యం చేశారు. కాగా, పోలింగ్ ముగిసి మూడు రోజులు కాకుండానే ఆర్వో కార్యాలయానికి తాళాలు వేసి గుంటూరుకు మకాం మార్చారు. ఆర్వో వెంట రెవెన్యూ సిబ్బంది వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఎన్నికల కార్యాలయానికి తాళాలు వేసి దృశ్యం

పరిసరాల శుభ్రతతోనే డెంగీ నివారణ : డాక్టర్ గీతాపద్మజ

మంగళగిరి సిటీ, మే 16: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే డెంగీ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గీతా పద్మజ అన్నారు. జాతీయ డెంగీ నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం డాక్టర్ గీతా పద్మజ మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమ కాటు వల్ల డెంగీ వస్తుందన్నారు. ఇళ్ల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కొబ్బరి బొండాలు, పాత టైర్లు, గాజు సీసాలు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లలో నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసాలుగా మారుతాయని, వాటిల్లో నీటిని ఎప్పటికప్పుడు పారవేయడం ద్వారా దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే వాటిని నిర్మూలించి డెంగీ వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈవో వెంకటేశ్వరరావు, మలేరియా సబ్‌యూనిట్ సూపర్‌వైజర్లు సాగర్, సైదులు, హెల్త్ అసిస్టెంట్లు కే శ్రీనివాసరావు, ప్రభుత్వాస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



డెంగీ అవగాహనా ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ గీతా పద్మజ, సిబ్బంది

అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభం

మంగళగిరి, మే 16: క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా మంగళగిరి గణపతినగర్‌లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం నుంచి బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభమైంది. బీసీజీ వ్యాక్సినేషన్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఈ ప్రశాంత్ హాజరై వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగ తాగే వారికి బీసీజీ వ్యాక్సినేషన్ ఇస్తారన్నారు. ఆశా వర్కర్లు ఇంటింటికీ వచ్చి వ్యాక్సినేషన్‌కు అర్హులైన వారిని గుర్తిస్తారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి గురువారం వ్యాక్సిన్ అందిస్తారని తెలిపారు. అర్హులైన ప్రజలందరూ వ్యాక్సిన్ వేయించుకుని క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీసీవో డాక్టర్ శ్రీనివాస్, టీబీ జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, హెల్త్ సెంటరు వైద్యాధికారి డాక్టర్ పీ అనూష, సూపర్‌వైజర్ జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లి టౌన్, మే 16: క్షయవ్యాధి రాకుండా పెద్దలకు బీసీజీ వ్యాక్సినేషన్ తాడేపల్లి పరిధిలోని అన్ని సచివాలయాల్లో ప్రారంభించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పి శాంతకుమారి తెలిపారు. ఈ ప్రక్రియ ప్రతి గురువారం ఆయా సచివాలయాల వద్ద జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.



తాడేపల్లిలో బీసీజీ వ్యాక్సినేషన్ వేస్తున్న సిబ్బంది

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి : ఎంపీడీవో

పెదనందిపాడు, మే 16: అధికారులు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా పనిచేసి గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో సునీతాశర్మ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం పనులు సక్రమంగా జరిగేలా చూడాలని, ఇంకుడు గుంతలపై రైతులకు అవగాహన కల్పించి, అధికంగా ఇంకుడు గుంతలు తీయించాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సునీతాశర్మ

మనసు కవి ఆత్రేయకు ఘన నివాళి

గుంటూరు, మే 16 : మనసు కవి ఆచార్య ఆత్రేయ జయంతి కార్యక్రమం అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా అవగాహన సంస్థ సాంస్కృతిక కార్యక్రమాల కో ఆర్డినేటర్ బిళ్ళా అశోక్ మాట్లాడుతూ ప్రేమకవిగా, మనసున్న కవిగా గుర్తింపు పొందిన ఆత్రేయ రాసిన పాటలన్నీ అమృత గుళికలేనని అన్నారు. ఆత్రేయ రాసిన సినిమా పాటల్లో తేలికైన పదాలతో ఎంతో బరువైన భావాలనైనా పలికించిన ఆత్రేయను సినీ వేమన అని చెప్పవచ్చని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాయిబాబు, పింగళి భాగ్యలక్ష్మి, మల్లేశ్వరరావు, రాజశేఖర్, ఆయుబ్‌ఖాన్, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

వైసీపీ కి ఓటమి భయం : ధారూనాయక్

గుంటూరు, మే 16 : పోలింగ్ ప్రక్రియ ముగిసినా ప్రతిపక్షాలపై దాడులు, వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలు జరుగుతున్నాయంటే వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్ అన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు స్వయంగా వందలాదిమంది అనుచరులతో గ్రామాలపై దాడులకు దిగడం హేయమని అన్నారు. సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ రోజు పల్నాడు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ మూకలు రెచ్చిపోయి దాడులకు ఒడిగట్టాయన్నారు. అధికారపార్టీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో గ్రామాలపై దండయాత్ర చేసి టీడీపీకి చెందిన నేతలపై దాడులు చేయడం దుర్మార్గ చర్య అన్నారు. మాచర్ల నియోజకవర్గంలో వందమంది తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తులు అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలో తిరుగుతుంటే పోలీసులు ఎందుకు కట్టడి చేయలేకపోయారని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ఆదేశాలు ఇస్తే కానీ మాచర్ల ఎమ్మెల్యే అతని సోదరుని గృహ నిర్బంధం చేయలేకపోయారన్నారు. పల్నాడు జిల్లాలో ప్రజలు వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేశారని గుర్తించిన పార్టీ నేతలు దాడులకు పాల్పడుతున్నారన్నారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వందల మందితో కారంపూడిపై పట్టపగలే దండయాత్ర చేయటం చూసిన ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ధారూనాయక్ విమర్శించారు.

రాష్ట్రంలోనే తొలిసారిగా జెన్-2 పెట్ సీటీ స్కానర్

● ఆర్కా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రాఘవరెడ్డి వెల్లడి

గుంటూరు (మెడికల్), మే 16 : ఆంధ్రప్రదేశ్ వైద్య రంగంలోనే మొదటిసారిగా గుంటూరులోని ఆర్కా హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో అత్యాధునిక 32 స్లైస్ జీఈ డిస్కవరీ జెన్-2 పెట్ సీటీ స్కానర్‌ని అందుబాట్లోకి తెచ్చినట్లు సంస్థ డైరెక్టర్, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పవన్ రాఘవరెడ్డి కల్లూరి తెలిపారు. ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కేన్సర్ వ్యాధి ఖచ్చితమైన నిర్ధారణతో పాటు రోగులకు అత్యున్నతమైన వైద్య సేవలు, వ్యాధి సంరక్షణ అందించడం సాధ్యపడుతుందని ఆయన వివరించారు. జెన్-2 పెట్ సీటీ స్కానర్ అందించే ఖచ్చితమైన ఇమేజ్‌లతో పలు రకాల కేన్సర్ జబ్బులను ప్రారంభ దశలో గుర్తించవచ్చని డాక్టర్ పవన్ రాఘవరెడ్డి వెల్లడించారు. డైరెక్టర్లు సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ హేమంత్ మాకినేని, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ డీఎస్ రాజు నాయుడు మాట్లాడుతూ జెన్-2 పెట్ సీటీ స్కానర్ తక్కువ సమయంలో అధిక రిజల్యూషన్ చిత్రాలను అందిస్తుందని, దీని వల్ల కేన్సర్ కణితులను ఖచ్చితమైన ప్రదేశం, లక్షణాలను తెలుసుకోవచ్చన్నారు. ఆర్కా హాస్పిటల్‌లో వెర్సా లీనియర్ యాక్సిలరేటర్, మామోగ్రామ్, సీటీ స్కాన్, డిజిటల్ పెథాలజీ వంటి ఇతర ఆధునిక వైద్య పరికరాలు ఉన్నట్లు తెలిపారు.



జెన్-2 పెట్ సీటీ స్కానర్‌తో వైద్య నిపుణులు

అరాచక పాలనను అంతమొందించాలని పోలేరమ్మకు మొక్కులు



అనంతవరం పోలేరమ్మ గుడిలో ఎన్డీఏ కూటమి గెలవాలని వేడుకుంటున్న మహిళలు

తుళ్లూరు, మే 16: వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనను అంతమొందించాలని అనంతవరం గ్రామంలో పోలేరమ్మవారికి మహిళలు రైతులు మొక్కుకున్నారు. అమరావతి ఉద్యమం 1600 రోజు చేరుకున్నప్పుడు అఖండ దీపం వెలిగించారు. పోలింగ్ పూర్తయ్యి అన్ని సర్వేలు ఎన్డీఏ కూటమి విజయం సాధించి, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారనే సంకేతాలు వెలువడటంతో అమ్మవారికి సారె సమర్పించి పూజలు జరిపి, లలితా పారాయణం చేశారు. రాష్ట్ర ప్రజల కష్టాలను కడతేర్చాలని అఖండ దీపం వెలిగించి నేటికి 11వ రోజుకు చేరుకుంది. భావితరాల వారి భవిష్యత్తును కాపాడమని అమ్మవారిని, పోతురాజును మహిళలు వేడుకున్నారు.

బాలోత్సవం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు

తాడేపల్లి టౌన్, మే 16: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణంలోని అమరావతి ఐకాన్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నుంచి వేసవి శిక్షణా తరగతులు ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా బాలోత్సవం రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 31వరకు లెక్కలు, డాన్స్ విభాగాల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. ఉదయం 9.30 నుంచి లెక్కలు, డాన్స్ విభాగాల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు లెక్కలు, 11 నుంచి 12.30 వరకు డాన్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. డాక్టర్ లెనిన్‌బాబు, ప్రఖ్యాత డాన్స్‌మాస్టర్ చందు శిక్షణ ఇస్తారని తెలిపారు. 5, 6, 7 తరగతుల జూనియర్స్ 8, 9, 10 తరగతుల సీనియర్స్‌కు శిక్షణ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు తమకు నచ్చిన వాటిలో శిక్షణ పొందవచ్చని తెలిపారు. ఒక్కో విభాగానికి రూ.500 ఫీజు చెల్లించాలని తెలిపారు. అపార్టుమెంటు వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. డిసెంబరులో రాష్ట్ర వ్యాప్తంగా బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 42విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ బాలోత్సవం కోశాధికారి సుబ్బారెడ్డి, నిరాహకులు కళ్యాణి, రమ్య, సంధ్యారాణి, న్యూటన్, పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం ఇక ఇంటికే



తాడికొండలో నిరసనలు వ్యక్తం చేస్తున్న రైతులు, మహిళలు

తాడికొండ, మే 16: సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొని వైసీపీకి వ్యతిరేకంగా ఓట్లు వేశారని రైతులు, మహిళలు తెలిపారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, బిల్డ్ అమరావతి పేరిట, రాజధాని రైతులకు మద్దతుగా తాడికొండలో రైతులు, మహిళలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గడిచిన నాలుగు సంవత్సరాల్లో అభివృద్ధిని పక్కన పెట్టి అప్పుల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. అమరావతిని అభివృద్ధి చేస్తే అప్పుల తిప్పలు తప్పేవని విమర్శించారు. ఇప్పటి కైన అమరావతిని అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని, ప్రజల భవిష్యత్తును కాపాడాలన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ఇంటికెళ్లడం ఖాయం అన్నారు.

సైన్స్ విద్యార్థుల కోసం

టెన్త్, ఇంటర్ తరవాత What Next

(నిన్నటి పేజీ తరువాయి)



ఫిషరీస్


సైన్స్, ఆర్ట్స్, బిజినెస్‌ను ఒక్కచోట చేరిస్తే అది ఫిషరీస్‌గా చెప్పవచ్చు. ప్రపంచంలో మత్స్య సంపదను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్న మూడో అతిపెద్ద దేశం భారత్. మన దేశానికి 7500 కిలోమీటర్ల విశాలమైన సముద్ర తీరం ఉంది. దీనితోపాటు దేశంలో కూడా అపారమైన నీటి వనరులు ఉన్నాయి. వీటన్నింటి కారణంగా ఈ రంగంలో అవకాశాలు విస్తారంగా కనిపిస్తాయి. ఫిషరీస్ రంగంలో ఉద్యోగాల విషయానికి వస్తే ఫామ్ మేనేజర్లు, హేచరీ మేనేజ్‌మెంట్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ - ప్రాసెసింగ్, ఫిషరీ ఇన్‌స్పెక్టర్, ఫిషరీ వర్కర్ తదితరాలు ప్రధానంగా ఉంటాయి. ఫిషరీ రంగంలోని టెక్నికల్ ఫీల్డ్‌లోకి వెళ్లాలనుకునేవారు బైపీసీతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. తెలుగు రాష్ట్రాల్లో ఏపీకి సంబంధించి ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ ఉంది. నెల్లూరు జిల్లా ముత్తుకూరులో ఉన్న ఫిషరీష్ కాలేజీకి ఎంతో చరిత్ర ఉంది.

తెలంగాణలోని పీవీనరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో కూడా ఒక కాలేజీ ఉంది.

డెయిరీ టెక్నాలజీ

భారత దేశంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న రంగాల్లో డెయిరీ ఒకటి. ప్రపంచ పశు సంపదలో భారత్ వాటా ఎక్కువే. మన దేశానికి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెడుతున్న రంగాల్లో డెయిరీ కూడా ఒకటి. అయితే ఈ రంగం ఇప్పటికీ సంప్రదాయ వ్యక్తుల చేతుల్లోనే ఉంది. చైనా, మెక్సికో లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఇందులో దూసుకుపోతుంటే మనం మాత్రం కొంత వెనకబడి ఉన్నామని చెప్పుకోక తప్పదు. మన దేశంలోని కొన్ని సంస్థలు డెయిరీ టెక్నాలజీలో కోర్సులను అందిస్తున్నాయి. చాలావాటిలో చేరడానికి ఇంటర్ పూర్తి చేసినవారు అర్హులు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఏపీ- తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, తెలంగాణ - హైదరాబాద్ (రాజేంద్రనగర్)లోని పీవీ నరసింహారావు తెలంగాణ స్టేట్ వెటర్నరీ యూనివర్సిటీ డైరీ టెక్నాలజీలో కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.

హెల్త్‌కేర్ ఇండస్ట్రీ



ఇంటర్ బైపీసీతో పూర్తి చేసినవారు ఎంబీబీఎస్ కోర్సులో చేరవచ్చు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు మెడిసిన్, డెంటల్ కోర్సుల్లో చేరాలంటే 'నీట్' ర్యాంకు తప్పనిసరి. నాలుగున్నర సంవత్సరాల ఎంబీబీఎస్ కోర్సు మూడు ఫేజులు, తొమ్మిది సెమిస్టర్లుగా ఉంటుంది. సాధారణంగా ఒక్కో సెమిస్టరుకు 120 వర్కింగ్ డేస్ గ్యాప్ ఉంటుంది. ఎంబీబీఎస్ పూర్తిచేసిన ప్రతీ విద్యార్థి 12 నెలల ఇంటర్న్‌షిప్‌నకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రధానంగా ఈ కింది రకాల మెడిసిన్ శాఖలు ఉంటాయి.

- మెడిసిన్(అల్లోపతి) అండ్ డెంటిస్ట్రీ,
- హోమియోపతి
- ఆయుర్వేద
- యునాని
- నేచురోపతి

ఈ కోర్సులను అందించే సంస్థల వివరాలు వెబ్‌పేజీలో...

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/KN1r9lc లో చదవండి.

- ఆంధ్రజ్యోతి ఎడ్యుకేషన్ డెస్క్

(ఎంపిక చేసిన కొన్ని కాలేజీల లిస్టును మాత్రమే ఇక్కడ ప్రచురించాం. పూర్తి వివరాల కోసం గూగుల్ సెర్చ్ చేయగలరు.)

దిక్సూచి DIKSUCHI

ఫార్మసిస్టులు

టెన్త్, ఇంటర్ అర్హతలతో ఫార్మసీలో డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సులు చేయవచ్చు. భారతదేశంలో ఫార్మసీ ఇండస్ట్రీ వంద సంవత్సరాల పురాతనమైనది. దేశవ్యాప్తంగా 25,000కు మించి మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటిలో ఐదోవంతు బల్క్ డ్రగ్ యూనిట్లే. ఎంపిసి లేదా బైపీసీతో ఇంటర్ పూర్తిచేసినవారు నాలుగు సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ(బిఫార్మసీ) కోర్సులో చేరడానికి అర్హులు. స్వయం ఉపాధి కోసం మెడికల్ షాపుల నిర్వహణ లేదా ఆస్పత్రుల్లో ఫార్మసిస్టుల ఉద్యోగాల అర్హతల కోసం రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఫార్మసీ కోర్సు చేయొచ్చు. బిఫార్మసీ చేసినవారు మాస్టర్స్ ఇన్ ఫార్మసీ కోర్సు చేయొచ్చు.

అగ్రికల్చర్, సంబంధిత రంగాలు

వ్యవసాయానికి సంబంధించిన డిగ్రీ కోర్సుల్లో చేరాలంటే కనీసం 50 శాతం మార్కులతో బైపీసీ పూర్తిచేయాలి. అగ్రికల్చర్ అలాగే సంబంధిత ఇతర కోర్సులను తెలుగు రాష్ట్రాల్లోని సంబంధిత యూనివర్సిటీలు అందిస్తున్నాయి.

- అగ్రికల్చర్, హార్టికల్చర్
- ఎన్విరాన్‌మెంట్ - పౌల్ట్రీ ఫార్మింగ్
- ఫారెస్ట్రీ అండ్ వైల్డ్ లైఫ్
- రూరల్ అండ్ మేనేజ్‌మెంట్
- వెటర్నరీ సైన్స్

ఫ్లోరీ కల్చర్

కమర్షియల్‌గా పూల సాగు చేయడమే ఫ్లోరికల్చర్. తెగులును తట్టుకునే లా, ఎక్కువ పూలు పూసేలా మొక్కలను తయారు చేయడమే ఫ్లోరికల్చరిస్టుల పని. హార్టికల్చర్‌లో భాగంగా ఉన్న ఇది తరవాతి కాలంలో ప్రత్యేక విభాగంగా మారింది. బీఎస్సీ హార్టీకల్చర్/అగ్రికల్చర్‌ను మన దేశంలో చాలా సంస్థలు అందిస్తున్నాయి. ఎంసెట్‌లో మెరిట్ ద్వారా మన రెండు రాష్ట్రాల్లో ఉమ్మడిగా ప్రవేశం పొందవచ్చు.

నవ్య | చిత్రజ్యోతి

థియేటర్ల బంద్ నిజం కాదు



రెండు తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ స్ర్కీన్ థియేటర్లను మూసివేస్తున్నారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని అపెక్స్ బాడీలు తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ గురువారం స్పష్టం చేశాయి. ఈ మేరకు ఆ సంస్థలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. థియేటర్లను మూసి వేస్తున్నట్లు ఒక సంఘం నిర్ణయం తీసుకుందంటూ వస్తున్న వార్తలను ఆ సంస్థలు ఖండించాయి. 'ఇప్పటివరకూ థియేటర్ల యజమానులు కానీ, వారికి సంబంధించిన సంఘాలు గానీ మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. ఇదంతా అబద్ధపు ప్రచారం మాత్రమే' అని స్పష్టం చేశాయి. 'కొన్నాళ్లుగా వసూళ్లు తక్కువ రావడం వల్ల కొంతమంది థియేటర్ల యజమానులు వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకుని ఉండవచ్చు, అపెక్స్ బాడీలకు దీంతో సంబంధం లేదు' అని పేర్కొన్నాయి. సింగిల్ స్ర్కీన్ థియేటర్లను మూసివెయ్యాలనే నిర్ణయం తీసుకునే ముందు ఎగ్జిబిటర్లు తమను సంప్రదించలేదని ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది.



కేన్స్‌కు ఐశ్వర్య కళ

ప్రతిష్మాత్మక 77వ కేన్స్ చలనచిత్రోత్సవాల్లో బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచసుందరి ఐశ్వర్యారాయ్ బచ్చన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గురువారం ఆమె రెడ్‌కార్పెట్‌పై నడిచారు. బ్లాక్ అండ్ వైట్ దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తూ వేడుకకు ప్రత్యేక కళ తెచ్చారు. ఫ్రాన్స్‌లో జరుగుతోన్న ఈ వేడుకల్లో ఐశ్వర్యతో పాటు కియారా అద్వాణీ, శోభితా ధూళిపాళ, అదితీరావ్ హైదరీ పాల్గొన్నారు.

చేతికి కట్టుతో...



ఐశ్వర్యారాయ్ బచ్చన్ కేన్స్ చలనచిత్రోత్సవంలో మరోసారి మెరవబోతున్నారు. గురువారం కూతురు ఆరాధ్యతో కలసి ఈ వేడుకల్లో పాల్గొనేందుకు బయల్దేరివెళ్లారు. తల్లీ కూతుళ్లు ఇద్దరూ గురువారం ముంబై ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు. చేతికి గాయం అయినప్పుడు ధరించే కట్టుతో ఐశ్వర్య కనిపించారు. దీంతో రెడ్‌కార్పెట్‌పై ఆమె ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/HPcIzIT లో చదవండి.

పెద్ద హిట్ అవుతుంది

'ఈ సినిమాకు అరుణ్, నాగ బలం. నేను ఇంతవరకూ దర్శకుల్ని పరిచయం చేశాను. తొలిసారిగా నాగను నిర్మాతగా ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. ట్రైలర్ చూస్తే టీమ్ పడిన కష్టం తెలుస్తుంది. ఇది న్యూ ఏజ్ లవ్ స్టోరీ అవుతుంది. ఈ నెల 25న వస్తున్న మా సినిమా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నా' అన్నారు దిల్ రాజు. ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'లవ్ మీ' ట్రైలర్‌ను గురువారం విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి ఈ సినిమాను నిర్మించారు.



దర్శకుడు అరుణ్ భీమవరపు మాట్లాడుతూ 'యుద్ధం చేయడం కంటే ప్రేమించడానికి గట్స్ కావాలి. మనిషి ప్రేమను పొందడమే కష్టం అనుకుంటే దెయ్యాన్ని ప్రేమించడం ఇంకెంత కష్టమో ఆలోచించండి. ఆశిష్ ఈ పాత్రను అద్భుతంగా పోషించాడు. గంగాదేవిలాంటి పాత్రను వైష్ణవి చేశారు. ఈ ప్రపంచాన్ని ప్రేమే నడిపిస్తోంది. 'వై' అనే క్వశ్చన్ లేకుండా 'వావ్' అనుకుని ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేయండి' అన్నారు. 'ఇంత మంచి సినిమా చేసే అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. మా సినిమాతో మళ్లీ థియేటర్లు కళకళలాడతాయి' అన్నారు ఆశిష్. ఈ చిత్రంలో డిఫరెంట్‌గా, టఫ్‌గా ఉండే పాత్రను పోషించానని వైష్ణవి చైతన్య చెప్పారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఉప వైద్య ఆరోగ్యాధికారి అన్నపూర్ణ, జిల్లా మలేరియాధికారి మురళీకృష్ణ సుబ్బరాయణ తదితరులు

డెంగీపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్నపూర్ణ

తెనాలి, మారీసుపేట మే 16: పట్టణ ప్రజలు డెంగీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ అన్నారు. పట్టణంలోని మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం వద్ద గురువారం జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఈరుగుల అన్నపూర్ణ ముఖ్య అతిథిగా పాల్గొని డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ డెంగీ దినోత్సవాన్ని భారతదేశ వ్యాప్తంగా మే 16వ తేదీన జరుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రజలలో డెంగీపై అవగాహన కలిగించి, తద్వారా వ్యాధిని అరికట్టాలనే అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వ్యాధిబారినపడిన వారు సమీప ఆరోగ్య కేంద్రాలలో ఉచిత నిర్ధారణ పరీక్షలు చేయించుకొని, ఉచిత మందులను పొందవచ్చన్నారు. అనంతరం పట్టణంలో సమాజ భాగస్వామ్యంతో డెంగీని నివారిద్దాం అనే నినాదానంతో అవగాహన ర్యాలీని జెండాను ఊపి ప్రాంభించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బనారాయణ, పట్టణ ప్రాథమిక కేంద్ర ఆరోగ్యధికారి డాక్టర్ బిబిజాన్, అసిస్టెంటు మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, ఆరోగ్య విస్తారణాధికారి అందె బాలచంద్రమౌళి, జి రవికుమార్, జంగం శ్యామ్, ఆరోగ్య పరివేక్షకులు దీపాల శ్రీనివాసరావు, ప్రసన్న, పుష్పలత, దాసరి శివనాగమల్లేశ్వరావు, శివరామప్రసాద్, షేక్ రషీద్, బాషిత్, ఆశా కార్యక్తలు, ఆరోగ్య కేంద్రాల మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవాసవి మాత జన్మదినోత్సవం


విద్యాధరిదేవిగా దర్శనమిచ్చిన వాసవి అమ్మవారు

తెనాలి, మారీసుపేట మే 16: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలోని శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవ వేడుకలను ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామిజీ) ఆధ్వర్యంలో ప్రారంభించారు. మొదటిరోజు శ్రీవాసవి అమ్మవారు విద్యాధరిదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకంను నిర్వహించి, పుష్పసహిత కుంకుమార్చనను భక్తులతో నిర్వహించారు. భక్తులు సామూహిక వాసవిమాత సంకీర్తలను పాడారు. అమ్మవారిని దర్శించిన భక్తులకు బాలస్వామిజీ తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకటకృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య ఉప్పల నాగేశ్వరావు, గోపు రామకృష్ణ, కమిటీసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బోసురోడ్డులో...


శ్రీవాసవీ అమ్మవారు

తెనాలి అర్బన్, మే 16: బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జన్మదినోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు అమ్మవారికి అలంకారాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు, విశేష అర్చనలు నిర్వహిస్తారు. ఉదయం సుప్రభాత సేవ, పతాకావిష్కరణ, గణపతి పూజ, కుంకుమార్చన, సాయంత్రం లలితా సహస్రనామ పారాయణ, ధ్వజారోహణ, హోమాలు ఘనంగా జరిపారు. అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. కమిటీ సభ్యులు ఉప్పల వరదరాజులు, నూకల భాస్కరరావు, మద్దాళి శేషాచలం, మాలేపాటి హరిప్రసాద్, కొణిజేటి శంకరరావు, హరేరామ్ తదితరులు పాల్గొన్నారు.


టీకాలు వేస్తున్న వైద్యులు

బీసీజీ టీకాలు వేయించుకోవాలి: డీవైడీఎంహెచ్‌వో

తెనాలి అర్బన్, మే 16: టీబీ యూనిట్ ఆధ్వర్యంలో బీసీజీ టీకాలు వేసే కార్యక్రమాన్ని గాంధీనగర్ సచివాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ గురువారం ప్రారంభించారు. ప్రతి గురువారం సచివాలయాల్లో పెద్ద వారికి ఈ టీకాలు వేస్తారని ఇందుకోసం పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 60ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ టీకా తీసుకోవచ్చని, క్షయవ్యాధి మందులు వాడిన వారి కుటుంబ సభ్యులు షుగర్ వ్యాధిగ్రస్తులు, పొగ తాగేవారు టీకా వేయించుకోవాలన్నారు. కె.రాధిక, బీబీ జాన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనోత్సవాలు

తెనాలి, మారీసుపేట మే 16: జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 74వ ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఈ నెల 18వ తేది నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. మండల పరిధిలోని కఠెవరంలోని బ్రహ్మంగారి భజన మందిరంలో గురువారం మందిర కమిటీ సభ్యులు కరపత్రాలను అవిష్కరించారు. ప్రతిరోజు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేయటం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు జరుగుతాయని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పూజారి పూసపాలి శ్రీనివాసరాజు, బి వెంకటరాజు, పూసపాటి మాలకొండరాజు, గోపిరాజు, నటరాజు, సిద్దంరాజు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట మే 16: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో చలివేంద్రంలో చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. గురువారం అన్నదాత సుఖీభవ సభ్యులు జంపాల నిఖిల్ జన్మదినోత్సవం సందర్భంగా వారి తాతయ్య, అమ్మమ్మలు గుత్తా వెంకటరత్నం, వెంకటలక్ష్మిదేవిల సహకారంతో చల్లని మజ్జిగను పాదచారులకు, పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఆ సేవా కార్యక్రమాలలో భాగంగా ఈ వేసవిలో కూడా పాదచారులకు, పట్టణ ప్రజలకు వేసవిలో దాహాన్ని తీర్చడానికి దాతల సహకారంతో చల్లని మజ్జిగ, తాగునీరు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దాత వెంకటరత్నం మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ సేవా కమిటీ వారు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పేద ప్రజల కోసం కమిటీ వారు మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గుత్తా వెంకటరత్నం, వీవీ ప్రతాప్, కుర్రా శ్రీనివాసరావు, అబ్దుల్ రజాక్, పోతరాజు శ్రీను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట మే 16: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ సేవా శాంతి ఆశ్రమంలో, నందులపేటలోని శ్రీషిరిడి సాయి వృద్ధాశ్రమాలలోని వృద్ధులకు అన్నదాత సుఖీభవ తెనాలి వారు అన్నదానం చేశారు. గురువారం అన్నదాత సుఖీభవ సభ్యులు చందు యశోదమ్మ జ్ఞాపకార్థం కుమారుడు, కోడలు చందు రాజగోపాల్, లీలాకుమారి, మనుమడు, మనుమరాలు డాక్టర్ ఉదయభాస్కర్, డాక్టర్ అర్చనలు ఆశ్రమంలోని వృద్ధులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతో పేదలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సుజల రక్షిత నీటి పథకానికి రాజకీయ గ్రహణం

● ఐదేళ్లుగా నిర్లక్ష్యం నీడలోనే నిర్మాణాలు
● పనులు పూర్తయితే 29 గ్రామాలకు తాగునీరు
● ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు


పిచ్చి చెట్ల మధ్య ఎన్టీఆర్ సుజల రక్షిత తాగునీటి పథకం నిర్మాణాలు


ఎన్టీఆర్ సుజల సంపు చుట్టూ పెరిగిన పిచ్చి చెట్లు

పొన్నూరు టౌన్, మే 16: ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలని గత ప్రభుత్వంలో నిర్మాణం ప్రారంభించిన ఎన్టీఆర్ సుజల పథకానికి రాజకీయ గ్రహణం పట్టింది. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు గ్రామం వద్ద 2018లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ.3.74 కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ సుజల పథకానికి అప్పటి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. మండలంలో 29 గ్రామాలు ఉన్నప్పటికీ అత్యధిక గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటిపోయి, ఉప్పు నీరుగా మారిపోయాయి. ప్రజలు తాగునీటి వెతలను ఎదుర్కొంటున్నారు. ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా శుద్ధజలం అందించాలని ఆ నాటి పాలకులు కంకణం కట్టుకున్నారు. పథక నిర్మాణంలో భాగంగా పచ్చలతాడిపర్రు గ్రామం వద్ద పొన్నూరు ఛానెల్ నుంచి వచ్చే నీటిని సంపులోకి తీసుకొని శుద్ధి చేయటానికి మదర్ ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. సంప్ నిర్మాణం కూడా పూర్తి అయ్యింది. ఇందుకోసం పైప్ లైన్లు, మోటర్లు సైతం ఏర్పాటు చేశారు. మరికొద్ది పనులు ఉండగా 2019లో ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్టీఆర్ సుజల పథకాన్ని వైఎస్సార్ సుజల స్రవంతిగా పేరు మార్చారు. కానీ పథక నిర్మాణం పూర్తి చేయకపోవటంతో ప్రజలకు రక్షిత తాగునీరు అందని ద్రాక్షగానే మారింది. దీంతో ప్రజల దాహార్తిని తీర్చుకోవటానికి నీటిని కొనుగోలుచేసి వినియోగించుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

రూ.3.74 కోట్ల వ్యయంతో ప్లాంట్ నిర్మాణం

ప్రజల దాహార్తిని తీర్చేందుకు మండలంలోని అన్ని గ్రామాలకు శుద్ధ జలం అందించేలా రూ.3.74 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని నిర్మించారు. మదర్ ప్లాంట్ నిర్మించి బోర్లు ఏర్పాటుచేశారు. ఇక్కడ శుద్ధిచేసిన తాగునీటిని మినీ ట్యాంకుల ద్వారా గ్రామ పంచాయతీలకు సరఫరా చేసేలా పథక నిర్మాణం జరిగింది. ప్రైవేటు సంస్థ ఈ పథక నిర్మాణాన్ని పర్యవేక్షించేలా ఏర్పాట్లు జరిగాయి. ఈ పథక నిర్మాణం పూర్తయితే తాగు నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న కొండముది, పెద్దపాలెం, జడవల్లీ, చింతలపూడి, ములుకుదరు వంటి అనేక గ్రామాలకు మేలు జరిగేది. అయితే ప్రభుత్వం మారిపోవటంతో పథక నిర్మాణం అసంపూర్తిగా నిలిచింది. నాడు అమర్చిన మోటార్లు సైతం ప్లాంట్‌లో కనిపించటం లేదు. ప్రస్తుతం ప్లాంట్ మొత్తం పిచ్చిచెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తుంది. ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి అయ్యి అమలులోకి వస్తే ప్రజలకు 20లీటర్ల మినరల్ వాటర్ కేవలం రూ.2కే అందే వెసులుబాటు ఉండేది. ఒక్కొక కుటుంబం సరాసరిన రోజుకు రూ.40లీటర్ల వరకు వినియోగించుకుంటారు. ఈ నీరు అందుబాటులోకి రాకపోవటంతో ఈ 40లీటర్ల నీటిని కొనుగోలు చేసేందుకు సుమారు నెలకు రూ.1200 వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని గ్రామీణులు వాపోతున్నారు. ప్రస్తుత వేసవి దృష్ట్యా ఈ నీటి వినియోగం మరింత అధికంగా ఉంటుంది. అధికారుల బాధ్యతా రాహిత్యం, పాలకుల రాజకీయల కారణంగా ప్రజలకు రక్షిత తాగునీటి పథకం అందుబాటులోకి లేకుండా పోయిందని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. కేవలం ఎన్టీఆర్ సుజల పథకం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లినందునే రాజకీయ కారణాలతో పూర్తి చేయకుండా పాలకులు నిలిపివేశారనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ గ్రహణం కారణంగా ప్రజలకు రక్షిత తాగునీరు అందని ద్రాక్షగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

కొలకలూరులో ఆహ్వాన నాటికల పోటీలు ప్రారంభం


పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న నరసింహారావు, రైతే రాజు నాటికలో సన్నివేశం

తెనాలి అర్బన్, మే 16: రూరల్ మండలంలోని కొలకలూరులో ఆహ్వాన నాటికల పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. కొలంకపురి నాటక పరిషత్, వైకే నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను బొప్పన నరసింహారావు, కారంపూడి వెంకట్రావు ప్రారంభించారు. పరిషత్ గౌరవాధ్యక్షుడు స్వామి అధ్యక్షతన జరిగిన సభలో లంకా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, కళలను, కళాకారులను ఆదరిస్తున్న పరిషత్‌లను అభినందించారు. సమాజాన్ని నాటికలు తట్టి లేపుతాయని, సన్మార్గంలో నడిచేలా చూపుతాయన్నారు. రంగస్థల నటుడు ముత్తవరపు సురేష్‌బాబు, రచయిత పిన్నమనేని మృత్యుంజయరావులను ఘనంగా సన్మానించారు. కాట్రపాడు ఉషోదయ కళానికేతన్ కళాకారులు విముక్తి నాటిక ప్రదర్శించారు. ఈ నాటికను చెరుకూరి సాంబశివరావు రచించి, దర్శకత్వం వహించారు.

హైదరాబాద్ కళాంజలి కళాకారులు ప్రదర్శించిన రైతేరాజు నాటికను కంచర్ల సూర్యప్రకాశరావు రచించగా, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. సమాజాన్ని ముందుండి నడిపించాల్సిన యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్న వైనాన్ని కళాకారులు నాటికలో ప్రదర్శించారు. వారిని మత్తు నుంచి విముక్తుల్ని చేద్దామంటూ నాటిక సందేశం ఇచ్చింది. గోపరాజు రమణ తదితరులు పర్యవేక్షించారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు

ఆర్‌వోలతో జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి


ఓట్ల లెక్కింపుపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు సిటీ, మే 16: సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వేణు గోపాల్‌రెడ్డి రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఓట్లు లెక్కింపు ఏర్పా ట్లనకు సంబంధించి గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించిన భవనాల్లో కౌంటింగ్‌కు సంబంధించిన టేబుళ్ళు, బారికేడింగ్, సీసీ కెమెరాల ఏర్పాట్లతో పాటు అవసరమైన ఇతర సౌకర్యాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులు పరిశీలించి, వెంటనే పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ, ర్యాండమైజేషన్ ప్రక్రియలు సక్రమంగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ రోజు టేబుళ్ల, రౌండ్ల వారీగా వివరాలు రాష్ట్ర ఎన్నికల సం ఘానికి ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన సిబ్బందిని, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ తదితర సౌకర్యాలను ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సమావేశంలో సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో పెద్దిరోజా, ఆర్డీవో శ్రీఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, జీఎంసీ ఏసీ రాజ్యలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్(ట్రైనీ) స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాలలో వివా విద్యార్థుల ప్రతిభ

పెదకాకాని, మే 16: సీబీఎస్ఈ 2024 ఫలితాలలో టెన్త్, గ్రేడ్ 12 ఫలితాలలో వివా ది స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించినట్లు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం తెలిపారు. టెన్త్‌లో రావిపాటి వినీత్ 487/500 మార్కులు సాధించి గుంటూరు సీబీఎస్ స్కూల్స్ పరిధిలోనే అత్యధిక మార్కులు సాధించాడన్నారు. వివా విద్యార్థి జీవీఎస్ఎన్ విఘ్నేష్ మ్యాథ్స్ సోషల్ సబ్జెక్స్‌లో 100కి 100 మార్కులు సాధించి 482/500 మార్కులు పొందాడని, గ్రేడ్12కు చెందిన ఎమ్.సాత్విక 472/500 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచిందని వివరించారు. అనంతరం ప్రతిభ కనబరచి విద్యార్థులను వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కే.ఎస్.రావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, సీబీఎస్ సంధానకర్త జ్యోతిమెటిల్డా, సీనియర్ సెకండరీ సంధానకర్త ఎమ్.లక్ష్మీభాస్కర్, అధ్యాపకులు అభినందించారు.



అంగలకుదురు జేఎంజే కళాశాల వద్ద, తెనాలి మార్కెట్ యార్డు వద్ద వ్యర్థాలతో నిండిన డ్రెయిన్లు, తెనాలిలోని మురుగునీటి పంపింగ్ స్టేషన్

డ్రెయిన్లలో పేరుకుపోతున్న వ్యర్ధాలు

● ఇక్కట్లుపడుతున్న రైతులు
● అంగలకుదురు డ్రెయిన్ల దుస్థితిపై రైతుల్లో ఆందోళన
● నిరుపయోగంగా మురుగునీటి పంపింగ్ స్టేషన్
● డ్రెయిన్లకు పలుమార్లు సొంత నిధులతో మరమ్మతులు
● తెనాలి నుంచి వచ్చే డ్రెయిన్లో వ్యర్థాలు అరికట్టాలని రైతుల డిమాండ్

తెనాలి రూరల్, మే 16: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో డ్రైన్ల మరమమ్మతులపై అంతంతమాత్రంగానే దృష్టి సారించింది. ఫలితంగా వ్యర్థాలు, గుర్రపుడెక్క, ఇతర గడ్డి జాతి మొక్కలతో అవి పూడిపోయి నీరు పారుదల కాక తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తెనాలి పట్టణంలో ప్రతిరోజు లక్షల లీటర్ల నీటిని వాడుతారు. వాటిని డ్రెయిన్ల ద్వారా బయటకు పంపడం పరిపాటి. అదే క్రమంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాల, మార్కెట్ యార్డు, సుల్తానాబాద్ వంటి ప్రాంతాల్లో నివాసితులు వాడే మురుగునీరు సైడ్ కాలువల ద్వారా ప్రవహిస్తూ అంగలకుదురు జేఎంజే కళాశాల సమీపంలోని కాలువలోకి కలిసేలా ఏర్పాట్లు చేశారు. దీనికి సుల్తానాబాద్ వద్ద మురుగునీటి పంపింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్ ద్వారా కాలువలో వచ్చే ప్లాస్టిక్, మాంస వ్యర్థాలు, బ్రాంది సీషాలు, బీరుబాటిల్స్, పాత బట్టలు వంటి వాటిని అక్కడ ఏర్పాటుచేసిన గేటు ద్వారా నిలుపుదల చేసి వాటిని బయటకు తీసి డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంటుంది. అయితే అక్కడ ఆ స్టేషన్ పనిచేయకపోవడంతో సైడ్ డ్రెయిన్ ద్వారా అన్ని కలిసి అంగలకుదురులోని మురుగు కాలువలోకి కలుస్తున్నాయి. ఫలితంగా మురుగు ప్రవహించే కాలువ నిండా వ్యర్థాలు, గుర్రపుడెక్క వంటివి పెరిగిపోయి నీరు ప్రవహించక భూమి పొల్యూషన్‌తోపాటు గ్రామంలో వచ్చే నీరు కూడా కలుషితం అవుతున్నాయి. అదేవిధంగా దోమల ఉధృతి పెరిగిపోయి గ్రామంలో అనేక అనారోగ్య సమస్యలకు నిలయంగా ఆ కాలువలో వ్యర్థాలు నిలుస్తున్నాయని గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం వాపోతున్నారు. వ్యర్థాలు రాకుండా పలుమార్లు డ్రెయిన్‌కు జల్లెడ వంటివి అమర్చినప్పటికీ వాటిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోతున్నారని ఆ జల్లెడ ఉంటే వ్యర్థాలు వచ్చే అవకాశం ఉండదని చెబుతున్నారు. తెనాలి నుంచి వచ్చే వ్యర్థాలను తొలగించేందుకు పంచాయతీ సిబ్బందికి తలకు మించిన భారంగా మారుతుందని పలుమార్లు మునిసిపల్ అధికారులకు చెప్పినా సమస్యను మాత్రం పెడచెవినపెడుతున్నారని ఫలితంగా పంచాయతీ ఆదాయంలో కొంత మొత్తాన్ని కాలువ వ్యర్థాలకే పరిమితం చేయాల్సి వస్తుందని నాగభూషణం ఆరోపిస్తున్నారు. అంగలకుదురు నుంచి మురుగు ప్రవహించే కాలువ కఠెవరం, ఎరుకలపూడి వంటి గ్రామ రైతులు పంట పొలాల్లో నీటిని బయటకు పంపేందుకు అవసమైన తడులు వేసేందుకు వాడుతుంటారు. ఈ కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి పూడికలు తీయించకపోవడంతో నీరు ప్రవహించక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానిక రైతులు వాపోతున్నారు. దాదాపుగా 1000 ఎకరాలు సాగుచేస్తుంటారని ఎక్కువగా వరి, జొన్న, మొక్కజొన్నసాగు చేపడటం జరుగుతుందని ఐదేళ్లుగా డ్రెయిన్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో అది పూడిపోయి గడ్డిజాతి మొక్కలు పెరిగి నీరు పారుదల కాక తాము తీవ్ర ఇబ్బందులు చవిచూస్తున్నామని చెబుతున్నారు. గత సంవత్సరం టీడీపీ నాయకులు, గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణంలు ఆర్థికసాయం చేయగా రైతులు కొంత మొత్తంలో విరాళాల రూపంలో సేకరించుకుని నీరు పారుదలకు చర్యలు చేపట్టామని రైతులు చెబుతున్నారు. మరో నెల రోజుల్లో వ్యవసాయ పనులు ప్రారంభం కానున్నాయని ఇప్పటికైనా డ్రెయిన్లలో వ్యర్థాలు రాకుండా తెనాలి మునిసిపాలిటీ దృష్టిపెట్టాలని అదేవిధంగా ఇరిగేషన్ అధికారులు మురుగు కాలువను పూడికతీయించి నీరు పారుదల అయ్యేలా చర్యలు చేపట్టాలని రైతులు, గ్రామ ఉపసర్పంచ్ కోరుతున్నారు.

నరేంద్రకు 20వేల పైచిలుకు మెజార్టీ ఖాయం

● జనసేన నాయకులు

పొన్నూరు టౌన్, మే 16: కూటమి పొన్నూరు అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ 20వేల పైచిలుకు ఓట్లతో గెలుపొందటం ఖాయమని జనసేన నాయకులు జనసేన పట్టణ, మండల అధ్యక్షుడు షేక్ కరిముల్లా, నాగిశెట్టి సుబ్బారావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం జనసేన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ పొన్నూరు అసెంబ్లీ పరిధిలో కూటమి అభ్యర్థుల విజయానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రెండు నెలల పాటు టీడీపీ, శ్రేణులతో పాటు, జనసేన నాయకులు, కార్యకర్తలు అహర్నిసలు పాటుపడ్డారన్నారు. ఓటర్ల వద్దకు వెళ్లి కూటమి అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎర్రసాని నాగభూషణం, మేకల రామయ్య యాదవ్, వల్లంశెట్టి శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.


కొల్లిపరలో మొక్కజొన్నలు వర్షానికి తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతులు

కొల్లిపర మండలంలో గాలి, వాన

● పంటలను రక్షించుకునేందుకు రైతుల ఇక్కట్లు

కొల్లిపర, మే 16: మండలంలో గురువారం సాయంత్రం వాతావరణంలో ఆకస్మికంగా మార్పు చోటు చేసుకుని మబ్బులు కమ్ముకొచ్చి గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. బొమ్మువానిపాలెం, అన్నవరం, అన్నవరం గౌడపాలెం, కొల్లిపర, తూములూరు, మున్నంగి, వల్లభాపురం తదితర గ్రామాల్లోని రైతులు మొక్కజొన్నలను నూర్పిళ్ళు చేసి కల్లాల్లో ఆరబెట్టారు. ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని రావడంతో రైతులు భయపడి పంటలను రక్షించుకోవటానికి పరుగులు తీశారు. కల్లాలో ఆరబెట్టిన మొక్కజొన్నలను కొంతమంది రైతులు ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లోకి తరలించారు. మరికొంత మంది రైతులు వర్షానికి పంటలు తడవకుండా కల్లాలోనే పట్టాలు కప్పారు. పంటలను రైతులు పట్టాలు కప్పి రక్షించుకున్నా, పట్టాలపై నీళ్ల నిలిచాయి.


బొమ్ముమానిపాలెంలో మొక్కజొన్నలపై కప్పిన పట్టలపై నిలిచిన వర్షపు నీరు

శేష వాహనంపై కొలువుతీరిన భావ దేవుడు


ప్రత్యేక పూజలందుకున్న సుందరవలీ రాజ్యలక్ష్మీ సమేత భవనారాయణ స్వామి

పొన్నూరుటౌన్, మే16: వార్షిక బ్రహోత్సవాలో భాగంగా శ్రీ సుందరవలీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భవనారాయణ స్వామి గురువారం శేషవాహనంపై పూజలందుకున్నారు. బ్రహోత్సవాలో భాగంగా స్వామి వారి ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం అర్చన కార్యక్రమాలు జరిగాయి. మహావిష్ణువు అలంకరణలో శేషవాహనంపై కొలుతీరిన సాక్షి భవనారాయణ స్వామి తొలి రోజు భక్తుల పూజలందుకున్నారు. ఉత్సవా ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పానకాల రావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


డఫ్‌పేటలో పికెట్ నిర్వహిస్తున్న అర్బన్ పోలీసులు

డఫ్‌పేటలో పోలీస్ పికెట్

పొన్నూరు టౌన్, మే 16: పట్టణలోని ఐదో వార్డు డఫ్‌పేటలో గురువారం అర్బన్ పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అర్బన్ సీఐ భాస్కర్ తెలిపారు. ఇటీవల డఫ్‌పేటలో రౌడీ షీటర్లు వీరంగం వేసిన సంఘటన చోటు చేసుకుంది. ఎన్నికల తదనంతరం అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందుగానే అనుమానాస్పద ప్రాంతాలలో పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.